
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 22 అక్టోబరు 2024



ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) సోమవారం ముగిశాయి. 16 రోజులపాటు జరిగిన ఈ ఆన్‌లైన్ పరీక్షలకు చివరిరోజున ఉదయం 186 మంది అభ్యర్థులకు 166 మంది, మధ్యాహ్నం 96 మందికి 71 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

విద్యుత్ ఈఈల బదిలీలు

ఏలూరుసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏపీఈపీడీసీఎల్ ఈఈలను బదిలీ చేస్తూ సోమవారం సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఎల్‌ఎంసీ ఈఈగా పనిచేస్తున్న సత్యనారాయణను ఏలూరు డీపీఈ ఈఈగా బదిలీ చేశారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ ఈఈగా పనిచేస్తున్న పీర్‌అహ్మద్‌ఖాన్‌ను జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఈఈగా, జంగారెడ్డిగూడెంలో ఆపరేషన్ ఈఈగా పనిచే స్తున్న పి.రాధాకృష్ణను ఏలూరు సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ ఈఈగా బదిలీ చేశారు.

ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

డీపీవో అనూరాధ

ఏలూరుసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నులు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇళ్లపన్నులు, మంచి నీటి కుళాయి పన్నులు ఎంత వరకు వసూలు చేసింది అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఎస్‌డబ్ల్యుఎస్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆ షెడ్లలో వర్మీకంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘ నిధులు, జనరల్ ఫండ్స్‌తో చేపడుతున్న పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసి వాటికి పరిపాలనా ఆమోదం, సాంకేతిక ఆమోదం తీసుకుని పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమీక్షలో జిల్లాలోని డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

దిగొచ్చారుగా..!

కొత్త పాలసీతో బార్ ధరలు ధమాల్

- క్వార్టర్ ఒక్కింటికి 10 నుంచి 20 రూపాయలు తగ్గింపు
- షాపులకు అధిక సమయం కేటాయించడమే ఒక కారణం
- కస్టమర్లను నిలబెట్టుకునేందుకు ఇంకో ఎత్తుగడ..జిల్లాలో సిత్రం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న బార్‌లన్నీ దిగొచ్చాయి. ఇప్పటి వరకు బయట మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరకంటే అదనంగా క్వార్టర్‌కు 40 నుంచి 50 రూపాయలు బార్‌లు వసూలు చేసేవి. కాని కొత్త మద్యం విధానం అమలులోకి రావడం, ఆ వెంటనే ప్రైవేటు పద్ధతిలో దుకాణాలు వెలియడం చకచకా జరిగాయి. ఇప్పటివరకు ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తూ వచ్చింది. బార్‌లకు వార్షిక ఫీజు కోటి రూపాయలకు పైగా పెంచింది. ఇంత కట్టలేమని బార్ యజమానులు జగన్ సర్కార్‌కు మొర పెట్టుకున్నారు. బయట దుకాణాల కంటే క్వార్టర్‌కు ధర పెంచి వసూలు చేసుకునేందుకు అనువుగా అప్పటి సర్కార్ అనుమతించింది. దీంతో ప్రభుత్వం మద్యం దుకాణాల్లో ఒక రేటు, బార్‌లలో ఇంకో రేటు ఎడాపెడా నడిచాయి. ఆఖరుకి బీర్ ధరలతో చుక్కలు చూపించారు. బయట దుకాణాల్లో ఒక్కో బీర్ రూ.220 ధర పలుకగా, అదే బార్‌లో అయితే రూ.270 నుంచి రూ.290 ధర వసూలు చేశారు. ఆఖరుకి ప్రీమియం బ్రాండ్ ధరలన్నీ ఇలాగే పెంచి మరీ సొమ్ము చేసుకున్నారు. ఈ పరిస్థితి అంతా సంవత్సరాల తరబడి కొనసాగి మద్యం ప్రియుల జేబులు ఖాళీ అయ్యాయి. కాని వారం క్రితమే కొత్త దుకాణాలు అమలులోకి వచ్చాయి. వీటిలోను మద్యం ధరలు యథావిధిగా పాత తరహాలోనే కొనసాగాయి. అయితే దుకాణాల సమయం మాత్రం ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అనే నిబంధనను కొంత సడలించి ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు 12 గంటలపాటు మద్యం విక్రయాలకు అనుమతి ఇచ్చారు. ఇంతకుముందు రాత్రి 9 గంటలకే దుకాణాలు మూతపడడంతో మద్యం ప్రియులంతా బార్‌లను ఆశ్రయించేవారు. రాత్రి 11 గంటల వరకు తమ రీతిలో ఎడాపెడా ఎంజాయ్ చేసేవారు. అయితే ఇప్పుడు కేవలం గంటపాటు మాత్రమే వ్యవధి ఉండడం, మద్యం ప్రియులంతా దుకాణాలకే పరిమితం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న బార్‌లన్నీ ధరల విషయంలో ఆదివారం నుంచి దిగొచ్చాయి. తాము ఇప్పటి వరకు అనుసరిస్తున్న మద్యం ధరలను కొంతలో కొంత తగ్గిస్తున్నట్టు ఏకంగా బోర్డులే పెట్టాయి. చౌకధరల దుకాణాల్లో ధర తగ్గిందోచ్ అన్నట్టుగా మద్యం ప్రియులను బార్‌ల వైపు ఆకర్షించేందుకు, క్వార్టర్ ఒక్కింటికి ఇంతకుముందు వసూలు చేస్తున్నట్టుగా కాకుండా రూ.260లోపే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంటే క్వార్టర్ ఒక్కింటికి 10 నుంచి 20 రూపాయలకు తగ్గించినట్టయ్యింది. 'ఇన్నాళ్ళు బార్‌లదే ఇష్టారాజ్యం. ఇప్పుడేమో కొంత దిగొచ్చారు. ఎడాపెడా ఐదేళ్ళు వాయించేశారు. జేబులన్నీ ఖాళీ చేసేశారు. కొత్త దుకాణాల్లోను ధరలు మరికాస్త తగ్గిస్తే మరీ బెటర్ అంటూ మద్యం ప్రియులు కామెడీలు చేస్తూ ఊగిపోతున్నారు.



ఏలూరులో బార్‌ల వద్ద ధరలు తగ్గించినట్టు ఏర్పాటు చేసిన బ్యానర్లు

ముంపుటేరు!

ఆక్రమణల చెరలో ఉప్పుటేరు.. కొల్లేరుకు ముప్పు



ఉప్పుటేరుపై నూతనంగా నిర్మించిన రైల్వే బ్రిడ్జి పిల్లర్లు

- బుడమేరు ప్రక్షాళనతో పొంచి ఉన్న మరింత ప్రమాదం
- రైల్వేబ్రిడ్జి నిర్మాణంలో అధికారుల సమన్వయలోపం
- ఉప్పుటేరు ప్రక్షాళనకు డిమాండ్

కొల్లేరు సరస్సులోకి ఏటా 10 నుంచి 15వేల క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఇలా వచ్చిన నీరు సముద్ర గర్భంలో కలవాలంటే ఏకైక మార్గం ఉప్పుటేరు మాత్రమే. సుమారుగా 65 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన ఉప్పుటేరు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవడంతో ఎగువ నుంచి వచ్చిన నీరు పారుదలకు అవరోధంగా మారడంతో కొల్లేరు లంక గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఉప్పుటేరు ప్రకాళన చేయాలని కొల్లేరు గ్రామాల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కైకలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు ఆక్రమణలతో ఏటా కొల్లేరు పరీ వాహక ప్రాంతంలోని 40 లంక గ్రామాలకు పైగా ముంపు బారిన పడుతూనే ఉన్నాయి. ఇటీవల విజయవాడను బుడమేరు పొంగి ముంచేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరు ప్రక్షాళన చేపడతామని వెల్లడించారు. బుడమేరు ప్రక్షాళన చేస్తే ఎగువ నుంచి వేలాది క్యూసెక్కుల నీరు నేరుగా కొల్లేరులోకి చేరుతుంది. ఈ కారణంగా కొల్లేరుకు భారీగా ముంపు పొంచి ఉంటుంది. ఇప్పటికే కొల్లేరు సరస్సులోనికి వచ్చే బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు వంటి 60 మైనర్, మేజర్ డ్రెయిన్ల ద్వారా నీరు చేరడంతో 93,138 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు జలమయంగా మారుతోంది. ఏటా వర్షాకాలంలో లంక గ్రామాల రహదారులు ముంపునకు గురై బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతు న్నాయి. బుడమేరు ప్రక్షాళన చేస్తే దాని ప్రభావంతో కొల్లేరు ముంపునకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోతే గ్రామాలకు గ్రామాలే మునిగిపోయే పరిస్థితులున్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం

ఉప్పుటేరు ఆక్రమణలు ఒక వంతు అయితే ఐదేళ్ల క్రితం దక్షిణమధ్య రైల్వే చేపట్టిన రైల్వే డబ్లింగ్ పనులలో భాగంగా కైకలూరు మండలం జంగంపాడు, పల్లిపాలెం, ఆకివీడు మండలం దుంపగడప మధ్యలో ఉప్పుటేరుపై రైల్వే రెండో బ్రిడ్జి నిర్మాణం చేశారు. ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు తీసుకున్న రైల్వే అధికారులు వారి పనులలో స్థానికంగా ప్రజా ఇబ్బందులను గుర్తించకపోవడంతో కొల్లేరు ముంపుబారిన పడుతోంది. పూర్వం నిర్మాణం చేసిన రైల్వే వంతెనతో ముంపు సమస్య లేనప్పటికీ కొత్త వంతెన నిర్మాణంతో కొల్లేరు ముంపు బారిన పడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా భారీ పిల్లర్లు నిర్మాణం చేయడంతో ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. రైల్వే అధికారులు నిర్మాణం చేస్తున్న వంతెనను డ్రెయినేజీ శాఖ అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇటీవల వచ్చిన వరదలతో దీనిని పరిశీలించిన కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ రైల్వే అధికారుల పనితీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా బ్రిడ్జి నిర్మాణం చేయడంపై మండిపడుతున్నారు. పిల్లర్ల స్థాయికి మించి నిర్మాణం చేయడం నీటి ప్రవాహాన్ని పూర్తిగా ఆపి వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఉప్పుటేరు ప్రక్షాళన చేయకుంటే ముంపే

ఉప్పుటేరు ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో ప్రస్తుతం ముంపు బారిన పడుతోంది. మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఉప్పుటేరును ప్రక్షాళన చేసి డ్రెడ్జింగ్ పనులను చేపట్టాలని ప్రయత్నించినా ఫలించలేదు. ముంపు సమయాల్లో ఆక్రమణలు తొలగిస్తామని ప్రకటనలు చేసిన ప్రభుత్వాలు ముంపు తొలగిన తర్వాత ఆ అంశాన్ని విస్మరిస్తున్నాయి. సుమారు 65 కిలోమీటర్ల పొడవునా వ్యాపించిన ఉప్పుటేరు ప్రభుత్వ రికార్డుల ప్రకారం 310 మీటర్ల వెడల్పున ఉంటుంది. ప్రస్తుతం ఆక్వా చెరువులు ఎక్కువ అవడంతో ఉప్పుటేరు గట్టున ఆనుకున్న రైతులు ఎక్కడిక క్కడ ఆక్రమణలకు గురి చేశారు. కలిదిండి మండలం కొండంగి, పల్లిపాలెం ప్రాంతాల్లో ఉప్పుటేరు వెడల్పు 100 మీటర్లు కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ప్రధానంగా ఉప్పుటేరు కైకలూరు, కలిదిండి, ఆకివీడు, కాళ్ళ, కృత్తివెన్ను మండలాల్లో విస్తరించి ఉంది. ఉప్పుటేరుకు రెండు వైపుల ఉన్న ఆయా మండలాల్లో పెద్దఎత్తున ఆక్రమణలకు గురైంది.



ఆక్రమణలతో కుంచించుకుపోయిన ఉప్పుటేరు



జడ్పీలో జగడమేనా?

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌కు ఇంతకుముందు వైసీపీ పక్షానికి చెందిన ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఇటీవలే ఆమె వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. జడ్పీలో అత్యధిక బలం కలిగిన వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక తమ ఉనికిని కాపాడుకునేందుకు ఎత్తుగడలకు దిగారు. కొద్దిరోజుల కిందట జడ్పీ అత్యవసర సమావేశానికి పట్టుపట్టగా మరోసారి వైసీపీ అనుకూల జడ్పీటీసీలంతా సోమవారం జడ్పీ అతిథి గృహంలో ప్రత్యేకంగా సమావేశం కావడం చర్చనీయాంశమైంది. -7లో

హత్యాయత్నాల కేసుల్లో 11 మందికి జైలు

ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంలో రెండు కుటుంబాల మధ్య 2011లో భూ వివాదం కారణంగా ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలపై పరస్పరం నమోదైన రెండు కేసుల్లో నేరం రుజువు కావడంతో మొత్తం 11 మందికి ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. -7లో

అమరవీరుల సేవలు ప్రశంసనీయం

డీఐజీ అశోక్‌కుమార్





అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జిల్లా జడ్జి పురుషోత్తమకుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్ , జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో నెలకొని ఉన్న ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వశక్తులు అసాంఘిక శక్తుల చర నుంచి ప్రజాలను కాపాడడంలో తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పోలీసుల విధుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి అవగాహన సదస్సులు, విద్యార్థులకు వ్యాచరచన పోటీలు, రక్తదాన శిబిరాలు ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ పోలీసులు ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంటూ తమ విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబ సభ్యులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దేశం మొత్తం అమరవీరులైన 216 మంది పేర్లను జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు చదివినిపించారు. జిల్లా పోలీస్‌శాఖ నిర్మించిన అమరుల స్థూపం వద్ద జిల్లా పోలీస్ యంత్రాం గమంతా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ ఏడాది అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అధికారులు అందజేశారు. నగరంలోని వివిధ కాలేజీల విద్యార్థులతో కలసి పోలీసు అధికారులు, సిబ్బంది నగరంలో ర్యాలీ నిర్వహించి ఫైర్‌స్టేషన్ వద్ద మానవహారం నిర్వహించారు. జేసీ ధాత్రిరెడ్డి, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీడీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు : జేసీ

ఏలూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకత, నిత్యావసర వస్తువులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ జరిగే విధంగా పటిష్ట నిఘా ఏర్పాటు చేసే లక్ష్యంతో కలెక్టరేట్‌లో పీడీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు.

జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌకడిపో దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్లు పనితీరుపై పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతోందన్నారు. జిల్లాలోని ఆరు ఎంఎల్ఎస్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల నిల్వ, పంపిణీని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. పౌరసరఫరాల నిల్వ/పంపిణీలో అవకతవకలు జరిగినట్టు రుజువైతే అటువంటి వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ ద్వారా తక్కువ తూకం లేదా నాణ్యత లేకపోయినా, సక్రమంగా పంపిణీ జరగక అసౌకర్యం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, ఇందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ వాట్సాప్ నెంబర్ 7702003584, 08812-230448 ద్వారా ఫిర్యాదులు తెలపవచ్చన్నారు.

మార్చురీ అసిస్టెంట్ సస్పెన్షన్



ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీ విభాగంలో పనిచేస్తున్న మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 8వ తేదీ రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉన్న అనాధ మృతదేహాన్ని అంబులెన్సులో ఎక్కించి చెన్నై మెడికల్ కాలేజీకి తరలించడానికి మార్చురీ అసిస్టెంట్ అశోక్ ప్రయత్నించాడు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని నిలదీయడంతో తిరిగి ఆ మృత దేహాన్ని తీసుకువచ్చి మార్చురీలో పెట్టేశాడు. ఈ ఘటనపై మహిళా ఉద్యోగిని రాత పూర్వకంగా ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ భాస్కర్‌కు ఫిర్యాదు చేయగా డాక్టర్ భాస్కర్ ఆ ఘటనపై ఈనెల 18వ తేదీన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌ను ప్రిన్సిపాల్ కోరారు. మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను సోమవారం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, నంద్యాలలో ఉన్న మెడికల్ కళాశాలలకు మృతదేహాలు వెళ్ళినట్టుగా ఇప్పటికే ప్రాథమికంగా స్పష్టమైంది. అధికారికంగా పంపలేదని అన్ని అక్రమార్గంలోని తరలించినట్లు స్పష్టమవుతోంది. మెడికల్ కళాశాలకు సంబంధించి మార్చురీ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ వారితో పోస్టుమార్టం పనులు చేయించకుండా కేవలం వేరే వారిచేత అక్కడ చేయించడంతోనే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తం ఇప్పటి వరకూ ఈ వ్యవహారంలో ఆరుగురు ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందించనున్నారు. అనాధ మృతదేహాలను మున్సిపాలిటీకి ఇవ్వకుండా మెడికల్ కళాశాలలకు అక్రమమార్గంలో పంపిస్తూ ఆ మృతదేహాన్ని తీసుకువెళ్ళే ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లతో మార్చురీ రిజిస్టర్‌లో మృతదేహాలను అప్పజెప్పినట్లుగా సంతకాలు పెట్టించినట్లు స్పష్టమవుతోంది.

తుఫాన్ గండం!

వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తం

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఏలూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా ఆపై తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చెబుతున్నాయి. దీని ప్రభావం జిల్లాపై పడనుందని, ఈనెల 24,25,26 తేదీల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల భారీగానే వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో సార్వా వరి కోతలు మొదలు కావడంతో వర్షాలు కురిస్తే పంట చేతికి అందే అవకాశాలు తక్కువగా ఉంటాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 34.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 4.5 మి.మీగా నమోదైంది. బుట్టాయిగూడెం 29.2, చింతలపూడి 12, దెందులూరు 11.2, చాట్రాయి 6.8, నిడమర్రు 6.4, కలిదిండి 4.4, మండవల్లి 4.2, లింగపాలెం 4.2 వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో భారీ వర్షాలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం తీర ప్రాంతంలో అల్పపీడన ప్రభావంతో తెల్లవారు జాము నుంచి వాతావరణంలో మార్పు చోటుకున్నది. సోమవారం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఉరుములకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నరసాపురంలో కొన్నిప్రాంతాల్లో మోకాలు లోతు నీరు నిలిచింది.



ఎం.నాగులపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

అదుగో చిరుత!

- ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత
- బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు



చిరుత తిరిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ద్వారకా తిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.నాగులపల్లి శివారులో రెండురోజుల క్రితం కన్పించి ప్రజలను బెంబేలెత్తించిన చిరుత.. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. అది ఆ పరిసర ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు అనుమానిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం ట్రాప్ కెమెరాలో చిరుత సంచారం నమోదు కావడంతో దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చిరుత సంచారాన్ని ఖరారు చేసేందుకు ఆ ప్రాంతంలో దొరికిన దాని పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలించేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రికి పంపారు. ఈ క్రమంలోనే ట్రాప్ కెమెరాకు చిరుత సంచారం జాడ కన్పించడంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రాప్ కెమెరాలను అదనంగా మరో రెండు కెమేరాలను చిరుత జాడ కన్పించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.



ఢాం..ఢాం

దిగని బాణసంచా ధరలు

గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరుగుదల

వాతావరణంపైనే వ్యాపారుల ఆశలు



నరసాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి పండుగకు ఒక ప్రత్యేక ఉంది. కుల మతాలకు అతీతంగా చాలామంది ఈ పండుగ జరుపుకుంటున్నారు. చిన్న పెద్ద, వృద్ధు లతో సహా ఏదో ఒక టపాసులు కాల్చి ఆనంద పడుతుంటారు. ఇక పిల్లలైతే ఈ పండుగ ఎప్పు డోస్తుందని ఎదురు చూస్తుంటారు. చేతిలో డబ్బులు లేకపోయినా... అప్పుతెచ్చి టపాసులు కొంటారు. ఈ పండుగ ఇంత ప్రత్యేకత ఉన్నందునే బాణ సంచా వ్యాపారం కూడా భారీగానే సాగుతోంది. ఏటా పెరుగుతూ వస్తుందే తప్ప తగ్గడం లేదు. అమ్మకాలు జరిగేది రెండు రోజులు అయినప్పటికీ కోట్లల్లోనే ఉంటుంది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు రెగ్యులర్ లెసెన్స్ వ్యాపారులు కాకుండా తాత్కాలిక లెసెన్స్‌లు పొంది దుకాణాలు పెట్టే వ్యాపారుల సంఖ్య కూడా ఎక్కువే. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా వాతావరణం అనుకూలిస్తే అన్నిచోట్ల ఫుల్‌గా వ్యాపారం సాగుతుంది. అధికారుల అంచనా ప్రకారం ఉమ్మడి జిల్లాలో రూ.20 నుంచి రూ.25 కోట్లుపైనే ఈ వ్యాపారం ఉంటుందని అంచనా. అత్యధికంగా భీమవరంలో సాగుతుంది. తరువాత స్థానంలో టీపీగూడెం, తణుకు, పాలకొల్లు, నర సాపురం నిలుస్తాయి. ఇక మండలాల్లో ఆకివీడు, ఉండి, పెనుగొండ, ఆచంట ప్రాంతాల్లో కూడా ఎక్కువగానే ఉంటుంది. జిల్లాలో లెసెన్స్ వ్యాపా రులు అత్యధికంగా తణుకు, టీపీగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో ఉన్నారు.

వాతావరణంపైనే ఆశలు

గత రెండేళ్ల నుంచి వ్యాపారం కలిసి రాలేదు. అల్పపీడనం కారణంగా వర్షాలు కురిశాయి. దీపావళి రోజున తెరిపి ఇవ్వడంతో కొద్దిగా వ్యాపారం జరిగింది. తాత్కాలిక వ్యాపారులంతా నష్టపోయారు. అయితే ఈసారి ప్రకృతి కలిసి వస్తుందన్న ఆశతో ఉన్నారు. దానికి అనుగుణం గానే తాత్కాలిక లెసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఈనెల 25 వరకు గడువు ఉంది. అత్యధికంగా పట్టణ ప్రాంతాల్లోనే దుకాణాలు వేసేందుకు మక్కువ చూపుతున్నారు. సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో ఈ తాత్కాలిక లెసెన్స్‌లు జారీ చేస్తున్నారు.



జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా..

అయితే జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా ధరలు మాత్రం దిగలేదు. గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. అవి కూడా కొన్ని రకాలే. మరికొన్ని రకాల్లో మార్పు లేదు. గతంలో పోలిస్తే డీజిల్ ధర తగ్గింది. ఈ కారణంగా రవాణ ఛార్జీలు తగ్గినా ధరలు మాత్రం దిగిరాలేదు. గతంలో దీపావళి సామాగ్రిపై 23 శాతం జీఎస్టీ ఉండేది, నేడు అది 18 శాతానికి దిగింది. ఇటు తయారీకి వాడే కెమికల్స్ ధరలు కూడా తగ్గాయి. ఈ కారణంగా ఈ ఏడాది టపాసుల ధరలు భారీగా తగ్గుతాయని భావించారు. కానీ అనుకున్న స్థాయిలో ధరలు దిగిరాలేదు. దీంతో రూ.1000 పట్టుకుంటే సంచి కూడా నిండని పరిస్థితే ఉంది. ఇక ధరల విషయానికి వస్తే.. కాకరపువ్వొత్తులు సాదా ధర రూ.75 ఉంది. ఇదే రకం పువ్వులు అయితే రూ.90 నుంచి రూ.100 వరకు ఉంది. భూచక్రాల బాక్స్ రకాన్ని బట్టి రూ.100 నుంచి రూ 150 మధ్య ఉంది. చిచ్చి బుడ్డుల రకాన్ని బట్టి ధరలు ఉన్నాయి. చిన్నవి బాక్స్ రూ.60 నుంచి 80, పెద్దవి రూ.70 నుంచి రూ.100 పలుకుతోంది. చిన్నారులు ఇష్టంగా కాల్చే పెన్సిల్స్ ధరలు కూడా రూ.50కి చేరింది. 1000 వాలా బాక్స్ రూ.300, అదే 5000 వాలా అయితే రూ.1200 పలుకుతోంది. ఇక మిగిలిన టపాసులు ధరలు కూడా గత ఏడాదితో పోలిస్తే కొద్దిగా పెరిగాయి.

భయపెడుతున్న వర్షాలు



గత ఏడాదితో పోలిస్తే టపాసులు ధరలు పెద్దగా పెరగలేదు. కొన్ని రకాలు మాత్రమే స్వల్పంగా పెరిగాయి. మరికొన్ని ఆలాగే ఉన్నాయి. కెమికల్స్ , రవాణా ఛార్జీలు తగ్గడం వల్ల కొద్దిగా దిగి వచ్చాయి. శివకాశీలో కూడా పెద్దగా అమ్మకాలు లేవు. తయారీ కూడా తగ్గింది. ఈ ప్రభావం వల్ల ధరలు పెద్దగా పెరగలేదు. ఏటా పది నుంచి 20 శాతం పెరుగుతాయి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. గత రెండేళ్ల వర్షాల కారణంగా వ్యాపారులు నష్టపోయారు. దీనికి తగ్గట్టు ఈ సంవత్సరం ఎన్నడూ లేని విధంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో వ్యాపారుల్లో భయం నెలకొంది. గతంలో మాదిరిగా పెద్ద ఎత్తున స్టాక్‌లు కొనడం లేదు.

-యర్రంశెట్టి మోహనరావు, వ్యాపారి



అమ్మను గెలిపించాడు..

భర్త చిన్నప్పుడే పట్టించుకోకుండా వదిలేశాడు.. అయినా ఆమె తన బిడ్డ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది ..టైలరింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదివించింది. ఆకివీడుకు చెందిన బొంతాడ లక్ష్మీ భర్త తన కుమారుడు ఏడాది వయసు ఉన్నప్పుడే వదిలి వెళ్ళిపోయాడు. రాత్రి పగలు కష్టపడి టైలరింగ్ చేస్తూ తన బిడ్డ జీవన్‌కుమార్‌ను ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ ప్రైవేటు కాన్వెంటులో చదివించింది. ఖర్చయినా ఆరవ తరగతి కార్పోరేట్ కళాశాలో జాయిన్ చేసింది. తన తల్లి నమ్మకాన్ని జీవన్ వమ్ము చేయలేదు. నీట్‌లో 675 మార్కులు సాధించాడు. ఇప్పుడు కాకినాడ రంగరాయ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కొడుకు చదువుకోసం ఆ తల్లి పడుతున్న కష్టం తెలిసి లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిలుకూరి కృష్ణంరాజు జీవన్‌ను దత్తత తీసుకున్నారు. ఏడాదికి రూ.85 వేలు ఖర్చు అవుతుందని చదువు పూర్తయ్యేవరకు ఖర్చు తానే పెట్టుకుంటానని ముందుకు వచ్చారు. మరికొంతమంది లయన్స్ సభ్యులు కూడా సాయం చేసేందుకు ముందుకు వచ్చారు.

- ఆకివీడు



హరహరా అంటే కోనేరులో నీటి బుడగలు

కలిదిండిలో ప్రాచీన ఆలయం

కలిదిండిలో అతి ప్రాచీన దేవాలయం పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయాన్ని రాజరాజ చోళుడు కుమారుడు రాజరాజ నరేంద్రుని కాలంలో ఒక రైతు నాగలితో పొలం దున్నుతుండగా నాగలి కర్రు తగిలి నెత్తురు వరదలై బయట పడ్డ స్వయంభూ లింగంగా స్థల పురాణం చెబుతోంది.



స్వయంభూ లింగం బయట పడిన చోటే ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణంలో పంచబుగ్గల కోనేరు ఉంది. కోనేరు చెంతకు భక్తులు వెళ్లి హరహర అంటే బుడ బుడమంటూ ఐదు బుగ్గలు రావటాన్ని నేటికీ ప్రత్యేకంగా వీక్షించవచ్చు. దక్షిణ కాశీగా పేరొందిన కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు.

-కలిదిండి



పార్టీ సభ్యత్వం తీసుకోండి !

జూనియర్ చంద్రబాబుగా పిలవబడే ఆచంట చినపేటకు చెందిన ఆంద్రు లక్ష్మణ రావు గత కొన్ని సంవత్సరాలుగా టీడీపీ కార్యకర్తగా పనిచేస్తూ అప్పుడపుడూ చంద్ర బాబునాయుడులా వేషం కడుతుంటారు. దగ్గరలో ఎక్కడైనా చంద్రబాబు నాయుడు మీటింగ్‌లు జరిగినపుడల్లా తన సైకిల్‌కు టీడీపీ జెండాలు కట్టి అందరిని ఆకర్షించేలా వేషాలు వేస్తూ ఆకట్టుకుంటాడు.బర్త్‌డే వేడుకల్లో స్టేజీమీదకు వచ్చి చంద్రబాబు నాయుడులా మిమిక్రీ చేస్తుంటారు. ఈ నెల 26 నుంచి జరగబోయే పార్టీ సభ్యత్వ నమోదు అందరూ తీసుకోవాలని కోరుతూ ఆచంటలో ఇలా ప్రచారం చేస్తున్నారు.

- ఆచంట

సమ్‌థింగ్ స్పెషల్

4 am బిర్యానీ

తెల్లవారుజాము

నాలుగు గంటలకే రెడీ..

క్యూ కడుతున్న యువత



బిర్యాని అంటే ఇష్టపడని వారు ఉండరు. బిర్యానీ ఎక్కువగా మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో తింటారు.. కానీ తెల్లవారు జాము నాలుగు గంటలకు కూడా బిర్యాని తింటారంటే కొద్దిగా ఆలోచించాల్సి విషయమే.. కానీ ఇది నిజమే ? ఎక్కడో తెలుసుకోవాలని ఉందా ? అంటే మీరు భీమవరం వెళ్లాల్సిందే.. భీమవరం మెంటేవారి తోట బైపాస్ రోడ్డులో ఉదయం 4 గంటలకు 4 ఏఎం బిర్యానీ పేరుతో బిర్యాని అందిస్తున్నారు. తెల్లవారు జామున ఎవరు తింటారులే అనుకుంటే మనం పప్పులో కాలు వేసినట్టే.. ఇక్కడి బిర్యానీ కోసం జిల్లాలోని తాడేపల్లిగూడెం, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, ఉండి వంటి ప్రాంతాల నుంచి యువత తెల్లవారు జామున వచ్చి బిర్యానీ టేస్టును ఆస్వాదిస్తున్నారు. మహానగరాలు అయిన హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకే పరిమితమైన ఈ బిర్యానీని భీమవరంలో మొట్టమొదటి సారిగా ఈట్ అండ్ బెస్ట్ రెస్టారెంట్ వారు ప్రారంభించారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 6 గంటల వరుకు బిర్యానీ లభిస్తుంది. ప్లేట్ బిర్యాని రూ.149 ఇస్తున్నారు. చిట్టిముత్యాల రైస్‌తో బిర్యాని తయారు చేసి ఉలవచారు, గోంగూరతో సర్వ్ చేస్తారు. ఉదయం వేళ కాబట్టి మసాలాలు, నూనెలు తక్కువ మోతాదులో వాడుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇడ్లీ తిన్నంత ఈజీగా ఈ బిర్యానీ కూడా అరిగిపోతుందని చెబుతున్నారు.



- భీమవరం అర్బన్

యువత అభిరుచికి అనుగుణంగా..



నేటి యువతకు ఉన్న అభిరుచికి అనుగుణంగా ఈ బిర్యాని ప్రారంభించాం. నేను మర్చంట్ నేవీలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. బిర్యానీలో ఉపయోగించే పదార్థాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడటం లేదు. యువత ఎక్కువగా ఈ బిర్యాని తినేందుకు వస్తున్నారు. డైజేషన్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా వంటకాల్లో పదార్థాలు ఉపయోగిస్తున్నాం. బిర్యాని రూ.149 చార్జి చేసున్నాం.

-ఎం.శ్యామ్, యజమాని



రోడ్లు ఇలా ఉంటే పడిపోరా !

రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసమే..ఎప్పుడు ఎక్కడ ఏ గోతులో పడిపోతామో తెలియని విధంగా రహదారులు తయారయ్యాయి. పెనుమంట్ర మండలం పాలమూరు శివారు నవుడూరు సెంటర్ సమీపంలో వీరవాసరం-బ్రాహ్మణ చెరువు రహదారిపై రోడ్డంతా పెద్ద పెద్ద గోతులతో మడుగులా తయారైంది. ప్రతిరోజు పదుల సంఖ్యలో వాహన దారులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. సోమవారం బైక్‌పై వెళుతున్న వారు ఇదిగో ఇలా గోతిలో పడి పోయారు. పాలమూరు గ్రామానికి చెందిన జన సైనికులు గోతిలో నీటిని శ్రమ దానం చేసి బయటకు తోడారు. జేసీబీ సాయంతో కంకర వేసి గోతులు పూడ్చారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వర్షాలు తగ్గితే తప్ప గోతులు పూడ్చలేమని తేల్చి చెప్పారు. జన సైనికులు చేసిన పనిని పలువురు అభినందిస్తున్నారు.



కంకరతో గోతులు పూడ్చుస్తున్న జనసైనికులు

- పెనుమంట్ర

ప్రోబ్లమ్ జోన్



వేంద్రలో రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బాబోయ్..కంపు భరించలేం !

చెత్త ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలంటూ లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి అవి నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. పాలకోడేరు మండలం వేంద్ర పంచాయతీ ఇందుకు ఉదాహరణగా కనిపిస్తున్నది. గ్రామంలోని చెత్తనంతా తీసుకొచ్చి పాలకోడేరు నుంచి వేంద్ర వెళ్ళే ఆర్అండ్‌బీ రహదారి పక్కనే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా మారి పోయింది. ఇక్కడ వేస్తున్న చెత్త తినేందుకు పందులు, కుక్కలు అక్కడకు చేరుతున్నాయి. ఆ వ్యర్థాల దుర్వాసనతో అటుగా వెళ్లే ప్రయాణికులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. అసలే వర్షాకాలం.. రోగాలు చుట్టుముడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గ్రామస్థులు విమర్శిస్తున్నారు. వేంద్ర పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు స్పందించి రహదారి వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పాలకోడేరు



ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టరు నాగరాణి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు సేవలందించాలి : కలెక్టర్

ఉండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు మేలైన సేవలందించాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం ఉండి మండలం ఎస్ఆర్‌పి అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంగాలు ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సును ఆమె ప్రారంభించారు. ఈ సంఘాలు కేవలం రైతులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసినవేనని అన్నారు. జిల్లాలో 76 పరపతి సంఘాలకు సంబంధించిన ప్రతినిధులకు కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అనంతరం వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఉండి కృషిజ్ఞాన కేంద్రంలో 30 ప్రతినిధులకు, వెంకటారామన్నగుడెంలో 20, ఎస్టీఆర్ జిల్లా గరికిపాడులో నలుగురు, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరుగురు, గుంటూరులో 16 మందికి శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు ఎం.నాగరాజు, కె.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మల్లిఖార్జునరావు, కోఆపరేటివ్, కృషి విజ్ఞాన కేంద్రాల, వ్యవసాయ శాఖల సిబ్బంది శిక్షణ పొందే ప్రాథమిక వ్యవసాయ శాఖ ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో 125 అధ్యాపక పోస్టులు

3,300 దరఖాస్తులు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో 125 అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నారు. నిట్‌లోని 8 ఇంజనీరింగ్ కోర్సులలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల కోసం 3300 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రాయపూర్ నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావును కేంద్రం నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అధ్యాపక పోస్టులు భర్తీ అయితే వచ్చే విద్యాసంవత్సరంలో 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు. ఏపీనిట్‌లో బోధన సిబ్బంది కొరత కారణంగా గడిచిన ఏడాది నుంచి సీట్ల సంఖ్యను కుదించారు. ఈ ఏడాది కూడా 480 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. అధ్యాపక పోస్టులు భర్తీ అయ్యాక బోధన సిబ్బంది కొరత తీరనుంది. ఇటీవల 19 మంది ప్రొఫెసర్లను భర్తీ చేశారు.

మహనీయుల స్ఫూర్తి

వాడవల్లి కీర్తి









స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగ ధనులుగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయులను ఆ గ్రామం గుండెల్లో పెట్టుకుంది. వారి విగ్రహాలను గ్రామంలో ఏర్పాటు చేసి యువకుల్లో పోరాటస్ఫూర్తిని నింపారు. ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామంలో పలువురు పోరాట యోధుల విగ్రహాలను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. 70 సంవత్సరాల క్రితమే గ్రామ ప్రముఖుడు కాశీనాథుని కుమారేశ్వరరావు సంకల్పంతో గ్రామస్థులు పలువురు చొరవ తీసుకుని విరాళాలు సేకరించి మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలతో పాటు, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే రోజున గ్రామస్థులు ఐక్యతా ప్రదర్శన నిర్వహించి వారికి నివాళులర్పిస్తుంటారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మహనీయుల విగ్రహాలను తొలిసారిగా ఒకే రోజున ఏర్పాటు చేసిన ఘనత వాడవల్లి గ్రామానికి దక్కిందని చెప్పవచ్చు.

-ముదినేపల్లి

వాడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, పొట్టి శ్రీరాములు వల్లభాయి పటేల్, టంగుటూరి ప్రకాశం పంతులు జవహర్ లాల్ నెహ్రూ , సుభాష్ చంద్రబోస్ ,మహాత్మాగాంధీ విగ్రహాలు

శ్రీవారి ఆదాయం రూ.3.03 కోట్లు



ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు ద్వారా గడచిన 33 రోజుల కాలానికి శ్రీవారికి రూ.3.03 కోట్ల నగదు, 597 గ్రాముల బంగారం, 8.244 కేజీల వెండి వచ్చినట్లు ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (45), రూ. రెండు వేలు(39)తో పాటు విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించారన్నారు.

వైద్య సేవలపై అలసత్వంవహిస్తే చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవలందించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్య శాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో ఇటీవల పురిటి నెప్పులతో ఇబ్బంది పడ్డ గర్భిణీ కథనంపై సోమవారం ఆయన ఏరియా ఆస్పత్రి ని ఆకస్మికంగా సందర్శించారు. వివిధ విభాగాలలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది రోగులతో వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రత్యేక విద్యా కోర్సుకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ రెండేళ్లకుగాను బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్యాకోర్సు 2024-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని, పరివర్తన్, బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఓసీలకు 50, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌వారికి 40 శాతం మార్కుల ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులన్నారు. కోర్సు పూర్తి అయిన వారికి ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, ఎస్ఎస్ఏలో, ఐఈఆర్టీ, రీసోర్స్ టీచర్లుగా సీబీఎస్ఈ, ఈ స్కూల్స్, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 99486 006 42 నెంబర్లో సంప్రదించాలన్నారు.

జడ్పీలో జగడమేనా?

» మళ్లీ అత్యవసర సమావేశానికి పట్టుపట్టిన వైసీపీ » ఏలూరులో సమావేశమైన 30 మంది జడ్పీటీసీలు » నెలలో ఇది రెండోసారి డిమాండ్ » అత్యవసరమా.. అదిలింపా » వెనకుండి నడిపిస్తున్న నేతలెవరు? » చైర్‌పర్సన్ పద్మశ్రీ అనుకూలురుల్లో మాత్రం ధీమా



ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌లో రోజురోజుకు రంగులు మారుతున్నాయి. ఇంతకుముందు వైసీపీ పక్షానికి చెందిన ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆమె ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి తన భర్తతో సహా టీడీపీలో చేరారు. దీంతో జిల్లా పరిషత్‌లో అత్యధిక బలం కలిగిన వైసీపీ కాస్తా ఖంగుతింది. కాని తమకున్న బలంతో ఎట్టి పరిస్థితుల్లోను కొన్ని తీర్మానాలను అడ్డుకోవాలని, ఇంకొన్నింటిని ముందుకు సాగకుండా చూడాలని, తద్వారా తమ పార్టీ ఉనికిని జడ్పీలో కాపాడుకునేందుకు వైసీపీ తరచూ ఎత్తుగడలు వేస్తూనే ఉంది. ఇప్పటికే జిల్లా పరిషత్‌కు సంబంధించి అత్యవసర సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా వైసీపీ అనుకూల జడ్పీటీసీలందరూ గట్టిగా పట్టుపడుతున్నారు. పక్షం రోజులకు ముందే ఒకసారి అత్యవసర సమావేశానికి పట్టుపట్టారు. తిరిగి మరోసారి వైసీపీ అనుకూల జడ్పీటీసీలంతా సోమవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.


ఏలూరు జడ్పీ అతిథి గృహం వద్ద వైసీపీ జడ్పీటీసీలు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా పరిషత్‌లో మొదటి నుంచి వైసీపీదే ఆధిపత్యం. జడ్పీలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 48 కాగా దీనిలో 46 వైసీపీ అనుకూలురుదే. వీరవాసరం, ఆచంట జడ్పీటీసీలు మాత్రం కూటమి పక్షంలో ఉన్నాయి. ఇంత అత్యధిక బలం కలిగిన జడ్పీలో అనూహ్యంగా చైర్‌పర్సన్ నేరుగా టీడీపీలో చేరారు. ఆ తరువాత మరికొంతమంది జడ్పీటీసీలు టీడీపీలో చేరతారని అందరూ భావించారు. ఆ ప్రక్రియ మాత్రం ఇప్పటిదాకా పూర్తికాలేదు. దీనికి తోడు వైసీపీ పెద్దలు మాత్రం జడ్పీలో తమకున్న బలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాగూ నాలుగేళ్ళు దాటనిదే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అవకాశం లేదన్న భావనతో ఏదొక రకంగా తమ పార్టీ ఉనికి ఉండేలా జాగ్రత్తపడడం ఆరంభించారు. జడ్పీటీసీ సభ్యులను పార్టీని వీడకుండా ఇప్పటికే కొంతమంది పూర్తిగా అనునయించారు. ఎందుకనంటే చైర్‌పర్సన్ ఒక్కసారిగా పార్టీ మారడంతో జడ్పీలో అత్యధిక సభ్యులు కూడా ఇదే బాట పడతారని అందరూ ఊహించారు. తీర ప్రాంతానికి చెందిన జడ్పీటీసీలు కొందరు నేరుగా జనసేనలోకైనా వెళ్తామే తప్ప టీడీపీ వైపు రాబోమన్న నిర్ణయానికి వచ్చారు. ఇలాంటి తర్జనభర్జనలు జడ్పీటీసీ సభ్యుల మధ్య తరచూ చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగా ఎమ్మెల్యేలంతా కూటమి పక్షానికి చెందిన వారు కావడం, తాము మాత్రం మండల స్థాయిలో జడ్పీటీసీ సభ్యులుగా వైసీపీలో ఉండి ఏమాత్రం ప్రయోజనమని భావిస్తున్న మరికొందరు మాత్రం టీడీపీవైపు తొంగి చూడడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాము ఎదురుతిరిగి ఏమీ చేయలేమని, సర్దుకుపోవడమే తప్ప అనే భావనలో ఇంకొందరు ఉన్నారు. ఇలా రకరకాలుగా ఎవరం తటవారుగా జడ్పీటిసిలు తమ మనోభావాలను పూర్తిగా బయట పెట్టలేక, అలాగని నేరుగా మౌనం దాల్చి ఉండలేక సతమతమవుతూనే ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి మా త్రం టీడీపీ కైవసం అయినా జడ్పీటిసి సభ్యుల్లో మాత్రం ఇంకా ఊగిసలాట కొనసాగుతూనే ఉంది.

ఎందుకు అత్యవసర సమావేశం ?

జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహించాలని కొందరు జడ్పీటీసీలు గట్టిగా పట్టుపట్టడానికి వెనుక బలమైన కారణాలు ఉన్నాయా ? వైసీపీలో కొందరు పెద్దల ఆదేశం మేరకే ఈ రకంగా బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారా ? లేకుం టే జిల్లా పరిషత్ తమ ఆధీనంలో ఉందన్న సంకేతాలు బలంగా బయటకు వెళ్ళేలా కొత్త ఎత్తుగడ వేశారా అనే సందేహాలే ఇప్పుడు అందరిలోనూ ఉన్నాయి. వాస్తవానికి జిల్లా పరిషత్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పెద్దగా నిధులు లేవు. జగన్ ప్రభుత్వ హయాంలో జడ్పీలకు ఎక్కడా ఆర్థిక ఊతమివ్వలేదు. ఆఖరుకి జనరల్ ఫండ్ విషయంలోను ఎప్పుడూ దోబూచులాటే. ఒకానొక దశలో జిల్లా పరిషత్‌లు తమ సభ్యులందరికీ జనరల్ ఫండ్ కింద కొన్ని నిధులు కేటాయించి వారి ఆధ్వర్యంలోనే ఆయా మండలాల్లో పనులు సాగేలా చూడడం సమాంతరంగా జడ్పీటీసీలకు కూడా స్థానికంగా ప్రతిష్ట ఉండేలా జాగ్రత్తపడిన సందర్భాలు ఉన్నాయి. కాని వైసీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం ఇవేవీ అప్పటి ప్రభుత్వానికి పట్టలేదు. జిల్లా పరిషత్‌లు దాదాపు నీరసించాయి. కొత్త పనులు చేపట్టలేక ఏదో తూతూ మంత్రంగా వ్యవహారం నడిపేవి. ఇప్పుడు పంచాయతీరాజ్ విభాగంలో మంత్రి పవన్‌కళ్యాణ్ వినూత్న చర్యలకు దిగుతుండడం, ఆయా పనులకు దగ్గరుండి పర్యవేక్షణ, నిధుల కేటాయిస్తుండడంతో కొంతమేర నూతన ఉత్తేజం కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహణకు వీలుగా వైసీపీ ఎజెండా ఏమిటనేదే అందరి ప్రశ్న. జడ్పీ అతిథి గృహంలో సోమవారం జడ్పీటీసీల సమావేశం నిర్వహణకు వైసీపీలో ఒక సీనియర్ నేత దగ్గరుండి నడిపించారని చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసీపీ నాయకత్వం బలహీనపడినా ఇంకో వైపు జిల్లా పరిషత్ సభ్యులను మాత్రం నేరుగా డైరెక్ట్ చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాదరావు మాత్రం ఇప్పటికీ ధీమాతో ఉన్నారు. కేవలం అలజడి సృష్టించడానికా, లేక తమకు కొత్త అవకాశాలు రావడానికా, జడ్పీటీసీల దూకుడనేది త్వరలో తేలబోతుందని ఇంకొందరు విశ్లేషిస్తున్నారు. అత్యవసర సమావేశాన్ని కోరుతూ దాదాపు 30 మంది జడ్పీటీసీలు సంతకాలు చేయడం మరొక అంశంగా భావిస్తున్నారు. ఇప్పటిదాకా అత్యధికులు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలోకి వస్తారని అందరూ లెక్కకట్టారు. కాని తాజా పరిణామాల ప్రకారం వైసీపీ అనుకూల జడ్పీటిసిలు ఉమ్మడిగా ఒకవైపే ఉండబో తున్నారా లేక అత్యవసర సమావేశమంటూ ఒక ఝలక్ ఇచ్చి తదుపరి నిర్ణయాల వైపు తొంగి చూస్తున్నారా అనేది కూడా చాలా మందిలో ఓ అభిప్రాయం ఉంది. అలా కాకుండా వైసీపీకి అనుకూలంగానే కడదాకా ఉండాలని వీరంతా భావిస్తే ఉమ్మడి పశ్చిమ జడ్పీలో మాత్రం భవిష్యత్తులో ఒకింత కుదుపే కాబోతుంది.

రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించండి : మహేశ్


కేంద్ర పెట్రోలియం కార్యదర్శితో ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేకంగా సీఎస్ఆర్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కేంద్ర పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్‌కు విన్నవించారు. ఢిల్లీలో పంకజ్ జైన్ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంధనం, సహజ వాయువు శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరానన్నారు. ఎంపీ విజ్ఞప్తికి పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వాసవిలో వర్క్‌షాపు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక అంశాలపై పట్టు సాధించే వర్క్ షాపులను సద్వినియోగం చేసుకోవాలని నిట్ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ కేవీ కాదంబరి పేర్కొన్నారు. పెదతాడేపల్లి గూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డిజైన్ చాలెంజర్స్ ఇన్ ఎయిమ్ జెస్ట్ అంటేనాక్ 5జీ డిమాండ్ కమ్యునికేషన్ కియరి 2 ప్రాక్టీస్ మిషన్ లెర్నింగ్ 5 రోజుల వర్క్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ నిట్ ఎలక్ట్రానిక్ విభాగాధిపతి యువరాజ్ విద్యార్థులకు సాంకేతికతలో మెళకువలు వివరించారు. కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకర్ రావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ రూపకల్పనకు శ్రీకారం

ఏలూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ నిధులతో ముద్రించనున్న 'విజయకేతనం' స్టడీ మెటీరియల్ రూపకల్పన ప్రక్రియకు వర్క్ షాపును సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్టు నుంచి ఎంపిక చేసిన 40 మంది ఉపాధ్యాయ నిపుణులతో కూడిన బృందంతో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడు తూ స్టడీ మెటీరియల్ గతేడాదికంటే మరింత క్వాలిటీగా ఉండేలా రూపొందించాలని సూచించారు. అనంతరం డీఈవో కార్యాలయంలో వర్క్ షాపును జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ప్రారంభించి, పలు సూచనలు చేశారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, కార్యాలయ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురుగు మందుల వల్లే అనర్థాలు

శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏడీఆర్‌ఏ శ్రీనివాస్

పెనుమంట్ర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగంతో సాగు ఖర్చులు పెరగడమే కాకుండా రైతులకు క్యాన్సర్, దృష్టి దోషాలు, చర్మ వ్యాధులు, వంటి సమస్యలు కూడా వస్తున్నాయని ప్లాంట్స్ ప్రొడక్షన్ జాయింట్ డైరెక్టర్ ఎ.సిద్ధిఖి అన్నారు. మార్టేరులోని ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో గోదావరి మండలాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులకు సమగ్ర సస్యరక్షణ చర్యలపై ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. డాక్టర్ సిద్ధిఖి మాట్లాడుతూ పురుగు మందులకు ప్రత్యామ్నాయాలైన వృక్ష సంబధిత కషాయాలు, జీవ నియంత్రకాల వాడకం వంటి వాటిపై కూడా అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పురుగులు, తెగుళ్ల, ఎలుకల కారణంగా సుమారు 30 శాతం పంట రైతులు కోల్పోతున్నారన్నారు. ఈ నష్టాన్ని తగ్గించుకోవడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులు అవలంబించేలా వారిని సమయాత్తం చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ప్రకృతి వ్యవసాయంపై కూడా అవగాహన కలిగించాలని జిల్లా వ్యవసాయధికారి జెడ్.వెంకటేశ్వరావు సూచించారు. మనోజ్ పురి గోస్వామి, డిప్యూటీ డైరెక్టర్, కె.వీరయ్య చౌదరి, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, డాక్టర్ టి.ప్రేమరంజితం, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు సురేష్, ఎ.ఉదయ్‌శంకర్, ఎంవీ కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

కబళించిన మృత్యువు

» బస్సు ఢీకొని దంపతుల మృతి » శుభకార్యానికి వెళుతుండగా ఘటన


మృతులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దుర్గ, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరేలోగానే బస్సు రూపంలో ఆ దంపతులను మృత్యువు కబళించింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన భార్యాభర్తలు బెల్లంకొండ వెంకటేశ్వరరావు (63), దుర్గ (50) కొవ్వూరు మండలం మద్దూరులోని ఉంటున్న వెంకటేశ్వరరావు సోదరుడి మనుమడి పురిటి స్నానం ఉయ్యాల కార్యక్రమానికి సోమవారం యాక్టీవాపై బయలుదేరారు. వీరిని నిడదవోలు మండలం గోపవరం వద్ద రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. దీంతో దంపతులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదు నిముషాల్లో శుభకార్యం జరిగే ఇంటికి చేరుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమిశ్రగూడెం ఎస్ఐ కె.వీరబాబు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణం వద్ద కన్నీటి సంద్రంగా మారిపోయింది. బంధువుల రోదనలు మిన్నంటాయి. వెంకటేశ్వరరావు దంపతుల స్వగ్రామం విజ్జేశ్వరం కాగా కూలి పనుల నిమిత్తం తణుకు మండలం పైడిపర్రులో నివాసముంటున్నారు.

పైడిపర్రులో విషాదఛాయలు

తణుకు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పైడిపర్రులోని నాగేంద్రనగర్‌లో నివాసముంటున్న దంపతులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దుర్గ మృతి చెందారనే విషయంలో తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటేశ్వరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దుర్గ సైతం భర్తకు తోడుగా స్థానికంగా ఉన్న పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కుమారుడు పద్మారావు, కుమార్తె లక్ష్మి ఉన్నారు. ఇరువురికి వివాహాలయ్యాయి. మృతులు ఇంటివద్దకు పెద్ద ఎత్తున స్థానికులు చేరుకుని జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నారు.

హత్యాయత్న కేసుల్లో..

11 మందికి మూడేళ్ల జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడినట్లు ఇరువైపులా నమోదైన రెండు కేసుల్లో నేరం రుజువు కావడంతో మొత్తం 11 మందికి ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంనకు చెందిన పేసేటి రంగనాయకమ్మ కుటుంబానికి, యలమర్తి భూపతియ్య కుటుంబాల మధ్య రెండేకరాల వ్యవసాయ భూమి (నిమ్మతోట)లో తగాదాలు ఉన్నాయి. 2011 మే 4వ తేదీ ఉదయం యలమర్తి భూపతయ్య కోడలు పద్మాకు రెండేకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో మామిడి చెట్లు కాయలు కోయడానికి వెళ్లగా పేసేటి రంగనాయకమ్మ, యలమర్తి భాస్కర్ చౌదరి, యలమర్తి దుర్గాదేవి, యలమర్తి గాంధీ, దేవినేనివారిగూడానికి చెందిన పాకలపాటి సుబ్రహ్మణ్యం కత్తులతో దాడి చేసి గాయపరిచారు. భూపతయ్య ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ ఎన్.పోతురాజు ఆ నిందితులపై హత్యాయత్న కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. నిందితులు ఐదుగురిపై నేరం రుజువు కావడ ంతో ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు.

ఇదే గొడవలో అదే గ్రామానికి చెందిన పేసేటి రంగనాయకమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ద్వారకా తిరుమల పోలీసులు అదే గ్రామానికి చెందిన యలమర్తి భూపతయ్య, యలమర్తి కాంతా రత్నం, యలమర్తి శ్రీనివాసరావు, యలమర్తి లక్ష్మణ రావు, యలమర్తి భాస్కరసురేష్, దెందు లూరు మండలం పెరుగ్గూడానికి చెందిన నల్లూరి శివ నాగుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ పోతు రాజు హత్యాయత్న కేసు నమోదు చేశారు. ఈ కేసు కూడా ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది.

ఈ ఆరుగురు నిందితులపై కూడా నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ లక్ష్మణ్ నాయక్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, కోర్టు కానిస్టేబుల్ సంసుద్దీన్, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ మురళీ, ఎస్ఐ సుధీర్‌బాబు సహకరించారు.

క్రైమ్ కార్నర్

భర్త తాగుతున్నాడని..

మొగల్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిస అయిన భర్తను చూసి మనస్థాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న వైనమిది. మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన లక్కవరపు అనూష (25) ఆమె భర్త మాణిక్యాలరావు మద్యానికి బానిసగా మారి ఆర్థిక ఇబ్బందులకు కారణమవు తున్నాడు. ముగ్గురు పిల్లలు ఉన్న అనూష భర్త తీరు మారకపోవడంతో తన ఇంట్లోనే ఈ నెల 19న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాయచూట్‌లో ఉన్న మృతురాలి తల్లి తివారి అంజలి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధలు భరించలేక..

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక ఒక యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని శాంతినగర్ 14వ రోడ్డులో నివాసముంటున్న పిల్లా దుర్గాప్రసాద్ (22) హోటల్‌లో పని చేస్తున్నాడు. అధికంగా అప్పులు ఉన్నాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి యధావిధిగా నిద్రించాడు. తెల్లవారేటప్పటికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని సోదరి పిల్లా రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధు వులకు అప్పగించారు.

మృతదేహం లభ్యం

పెదవేగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కవ్వగుంటలో ఈతకువెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతైన బెజవాడ ప్రసాద్(40) మృతదేహం సోమవారం లభించింది. కవ్వగుంట గ్రామానికి చెందిన బెజవా డ ప్రసాద్ గ్రామానికి సమీపంలోని పోలవరం కుడి కాలువలో ఆదివారం సాయంత్రం దిగి, ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

వాగులో గల్లంతైన యువకుడు మృతి

మోతుగూడెం/ఉంగుటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని సోకులేరు వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభించింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన కరణం రవితేజ (22) పది మంది స్నేహితులతో కలిసి ఈ నెల 18న సోకులేరు వచ్చా డు. వాగులో స్నానాలు చేస్తుండగా రవితేజ కనిపిం చలేదు. దీనిపై వారు మోతుగూడెం పోలీసులకు సమాచారం అందించారు. అతడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలించగా రవితేజ మునిగిపోయిన కిలో మీటరు దూరంలో అతడు విగత జీవిగా కనిపి ంచాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోతు గూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమవరం రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

భీమవరం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న మహిళను అరెస్టు చేసి రూ.లక్ష పది వేలు విలువ గల 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ పీటీవీ రమణ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో దీపావళి సందర్భంగా టపాసులు, బాంబులు వంటివి రవాణా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం టౌన్ రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఒక మహిళ పోలీసును చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న బ్యాగులు తనిఖీలు చేయగా 22 కేజీల గంజాయి పొట్లాలు ఉన్నాయి. విశాఖ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తుందని విచారణలో తేలినట్లుగా ఎస్ఐ తెలిపారు. ఆమెను రాజమహేంద్రవరం లక్ష్మీవరపుపేటకు చెందిన జెర్రిపోతుల రమణమ్మగా గుర్తించారు.

పల్టీలు కొట్టిన కారు.. నలుగురికి గాయాలు

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ని సూరంపాలెం వద్ద, విజయవాడ-సత్తుపల్లి రహదారిలో ఆదివారం రాత్రి కారు పల్టీలు కొట్టి మళ్ళీ నిలబడటంతో నలుగురు గాయపడ్డారు. లింగపాలెం మండలం యర్రంపల్లికి చెందిన గోలి వెంకటేశ్వరరెడ్డి భార్యా, కు టుంబ సభ్యులతో కలిసి కారులో సత్తుపల్లి వెళ్లి తిరిగివస్తుండగా కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి మళ్లీ నిలబడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా ఒకరు సుక్షితంగా బయటపడ్డారు. గాయపడినవారిని 108లో విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి ఇంటికి వస్తున్న మహిళ బ్యాగ్ చోరీకి గురైంది. వన్ టౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన కాలా నాగ ఉమామహేశ్వరి అట్లతద్ది సందర్భంగా వీరవాసరం తన పుట్టింటికి వెళ్లి ఈ నెల 20న భీమవరం బస్సులో వచ్చారు. అయితే బస్ డిపో వద్దకు వచ్చేసరికి తన వద్ద ఉన్న బ్యాగు ఉంది. ఇంటికి వెళ్ళి చూసేసరికి బ్యాగ్ కనిపించలేదు. ఆ బ్యాగ్‌లో 28 కాసుల బంగారు అభరాణలు చోరీకి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

పెంటపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న సామాను మొత్తం కాలి బూడిదైన ఘటన సోమవారం మండలంలోని పరిమెళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని గొర్రెల అప్పారావుకు చెందిన రెండు పోర్షన్ల డాబాలో భలే కిషోర్ అనే వ్యక్తి కుటుంబంతో సహా నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం సుమారు 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఘటనలో భలే కిషోర్‌కు చెందిన సుమారు రూ.నాలుగు లక్షల విలువ చేసే సామగ్రి కాలిపోయినట్లు తాడేపల్లిగూడెం ఫైర్ అధికారి రామారావు తెలిపారు.

గుండెపోటుతో సైనికుడి మృతి


ఆర్మీ జవాన్‌కు నివాళులర్పిస్తున్న ఆర్డీవో అద్దయ్య, సైనికులు (ఇన్‌సెట్‌లో) మృతుడు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

కొయ్యలగూడెం, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ బాధ్యతలకు వెళ్తున్న సైనికుడు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జరిగింది. కొయ్యలగూడెం పట్టణానికి చెందిన రావిపాటి ప్రవీణ్‌కుమార్ (40) గ్రామానికి వచ్చి తిరిగి రాజస్థాన్‌కు విధుల్లో చేరడానికి వెళ్తుండగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. దీంతో ఆర్మీ సుబేదర్ కిరణ్‌కుమార్ రాజస్థాన్ నుంచి విశాఖపట్నం చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని కొయ్యలగూడెం తీసుకువచ్చారు. మృతుడు హవల్దార్‌గా ఆర్మీలో పని చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్‌కు భార్య కుమార్తే ఉన్నారు. ప్రవీణ్ కుమార్ భౌతిక కాయానికి ఆర్డీవో అద్దయ్య, ఆర్మీ అధికారులు సుబేదర్, కిరణ్‌కుమార్, లక్ష్మీకాంత్, జిల్లా కేంద్రమైన ఏలూరుకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, సర్పంచ్ విజయకుమారి, తహసీల్దార్ తెల్లన్నదొర, మాజీ సైనికులు నివాళులర్పించారు. ప్రవీణ్‌కుమార్‌కు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

18 ఏళ్లకే నూరేళ్లు నిండాయా..

పద్దెనిమిదేళ్లకే నూరేళ్లు నిండాయా నాన్నా.. మేము ఏం పాపం చేశామని మాకీ కడుపుకోత.. దేవుడు ఎందుకింత అన్యాయం చేశాడంటూ ఆ తల్లి విలపిస్తూంటే అక్కడున్న వారికి సైతం కన్నీళ్లు ఆగలేదు. చిరుప్రాయంలోనే కుమారుడిని కోల్పోయిన ఆ తల్లి గుండెకోత ఎవరు తీర్చలేరంటూ బంధువులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.


కవులూరు చరణ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం గ్రామ శివారులో ఉన్న ఒక సామిల్లులో పనిచేస్తున్న కవులూరు చరణ్ (18)అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. సామిల్లులో పనిచేసే కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం సామిల్లులో కర్ర కోత మిషన్ పైన ఒక దుంగ పెట్టి మృతుడు చరణ్‌తో పాటు శివ,అజయ్ కోస్తుండగా యంత్రానికి ఒక్కసారిగా విద్యుత్ సరఫరా వచ్చింది. దీంతో చరణ్‌కు, శివకు షాక్ కొట్టడంతో శివ వెనక్కి పడిపోయాడు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కానీ చరణ్ మాత్రం మిషన్‌ను పట్టుకుని అలాగే ఉండి పోయాడు. వెంటనే మెయిన్ ఆఫ్ చేసి చరణ్‌ను విడిపించి ఆటోలో జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆ తర్వాత స్థానిక ఏరియా ఆస్పత్రికి పోస్టు మార్టమ్ నిమిత్తం తరలించారు. మృతుడు చరణ్ కొంతకాలం క్రితమే సామిల్లులో పనికి చేరాడు. అంతకుముందు తాపీ పనులకు వెళ్లేవాడని బంధువులు తెలిపారు. తమ కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని కుమారుని మృతదేహం వద్ద బోరున విలపించారు. గ్రామస్తులకు, బంధువులు సైతం కంటనీరు పెట్టుకున్నారు. చిం తలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మృతుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సామిల్లు యజమాని ఈ ఘటనపై స్పందించలేదని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలువురు టీడీపీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్కవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని కప్పలకుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కలపర్రు టోల్ ప్లాజా ఇన్‌చార్జ్ ప్రశాంత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏలూరు వైపు వెళ్లున్న ఓ లోడు లారీ కప్పలకుంట రహదారిపై నిలిచి ఉంది. ఇదే సమయంలో బైక్ పై వెళ్తున్న ప్రశాంత్ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఇతడ్ని వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తరచూ రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ వెట్రిసెల్వి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీ ఏ పీడీ ఆర్.విజయ్ రాజు, ఆర్డీవో అచ్యుత అంబరీష్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు క్షుణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. మొత్తం 284 అర్జీలు స్వీకరించారు. భూ తగాదాలు, పోలీస్, పంచాయతీరాజ్, హౌసింగ్, పారిశుధ్యం, విద్యుత్ తదితర వాటికి సంబంధించిన అర్జీలు స్వీకరించారు.

తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని, భార్య పిల్లలు ఎవరూ లేరని, జీవనం కష్టంగా ఉందని, పింఛన్ ఇప్పించాలని కోరుతూ ధర్మాజిగూడెంకు చెందిన ఏ.రాంబాబు అర్జీ అందచేశారు. భూ సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని ఉంగుటూరుకు చెందిన పొట్టు అంజమ్మ ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగానికి ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేశానని, ప్రస్తుతం ఉద్యోగం ఇష్టం లేదని, ఒరిజినల్ సర్టిఫికెట్లు అడిగితే ఇవ్వడం లేదని ఏలూరుకు చెందిన రత్నాల వనజ విజ్ఞప్తి చేశారు. సుమారు 60ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ పట్టా భూమిని వైసీపీ నాయకుడు కబ్జా ప్రయత్నం చేశాడని బాధితులు ముంగ మూరి వెంకటేశ్వరరావు, ఎం.మురారి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు, ఎం.మురారికి కొయ్యలగూడెం మండలం రాజవరంలో 2.44 ఎకరాల భూమికి వైసీపీ నాయకుడు సాధనాల సుబ్బారావు తప్పుడు పత్రాలు సృష్టించాడని తెలిపారు. తమ పొలంలో కొబ్బరిమొక్కలు కిరాయి గూండాలతో వైసీపీ నరికివేశాడని, పొలంలోకి వస్తే చంపేస్తామని బెదిరించాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అదే గ్రామంలో వైసీపీ నాయకుడు డి.విష్ణు మూర్తి చెరువును పూడ్చి దాల్వా పంట పండిస్తున్నాడని పేట సప్తగిరి బాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● బుట్టాయగూడెం: మండలంలోని యర్రాయిగూడెంకు చెందిన గిరిజన కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం జారీకి 10 నెలలుగా రెవెన్యూ అధికారులు తిప్పించుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్బాడి పోతయ్య, కబ్బాడి దారమ్మకు పిల్లలు లేకపోవడంతో చిన్నప్పుడే దత్తత తీసుకుని పెంచుకున్నారని, ఇటీవల తల్లిదండ్రులు చనిపోవడంతో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదన్నారు.

భర్త మరణ ధ్రువీకరణ పత్రం కోసం 10 నెలలుగా తిరుగుతన్నా పట్టించుకోవడం లేదని యర్రాయిగూడెంకు చెందిన కబ్బాడి గంగా చల్లమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ భూమిని వేరే వారి పేరున తప్పుడు ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలంటూ తామా పెదకన్నయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అధికారుల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌తో జాగ్రత్త : ఎస్పీ


ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్, ఏఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారుల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో అర్జీలు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ అవసరాల కోసం అప్పు చేసి వడ్డీతో సహ చెల్లించినా ఇంకా కట్టాలని వేధిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. జిల్లాలో వడ్డీ వ్యాపారులు వడ్డీ పేరుతో ప్రజలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి సేవలో మంత్రి నాదెండ్ల మనోహర్


మంత్రి నాదెండ్లకు శ్రీస్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ధర్మకర్త

ద్వారకాతిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని ఆలయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన బంగారువాకిలి గుండా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ ధర్మకర్త, ఈవో స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. ఉంగుటూరు, ఏలూరు, తాడేపల్లిగూడెం, పోలవరం ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, కూటమి నేతలు లంకా సత్తిపండు, మొగతడకల శ్రీనివాసరావు, పోలిన శ్రీనివాసరావు, మొగతడకల లక్ష్మీరమణి, ఏపూరి దాలయ్య, రత్నాజీ, ఆర్డీవో కె.అద్దయ్య పాల్గొన్నారు. కొండపైనున్న అతిథి గృహంలో ఆయన రాత్రి బస చేశారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన

కామవరపుకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలకు ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేందుకు అర్హత ఉందని, వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఓటు నమోదుకు ప్రోత్సహించాలని చెప్పారు. ఎంపీడీవో సరళ కుమారి, ఏవో సత్యవేణి, ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్‌కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రకాశం వీఎస్ఎన్ కళాశాలలో పట్టభద్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పట్టభద్రులంతా ఓటు హక్కు కలిగి ఉండాలని, రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. దీనిపై మండలంలోని పట్టభద్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి ఎన్.గోపి, ఆకుల అరుణ, దేవి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: భీమడోలు తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల క్లస్టర్, బూత్ ఇన్‌చార్జుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టభద్రుల ఓటర్ల నమోదుపై శిక్షణ ఇచ్చారు. బూత్ ఇన్‌ఛార్జులు అందరూ ఆయా బూత్‌ల పరిధిలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: పట్టభద్రులు ప్రతీ ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి వైసాయికిరణ్ సోమవారం పిలుపునిచ్చారు. ప్రతీ యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నవంబరు 26లోపు ఓటు నమోదు చేసుకోవాలన్నారు.



చర్మవ్యాధులపై అవగాహన సదస్సులో పాల్గొన్న ఆశ్రం సిబ్బంది

చర్మ వ్యాధులపై అవగాహన సదస్సు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చర్మవ్యాధులపై ఆశ్రం ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆశ్రం సీఈవో డాక్టర్ హనుమంతరావు తెలిపారు. డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ చర్మ సంబంధిత వ్యాధుల చికిత్సలో భాగంగా చికిత్సా విధానం, ఆపరేషన్లు, బొల్లు వ్యాధులు, పుట్టుమచ్చలు, చర్మంపై ముడతలకు చికిత్స విధానాన్ని శిక్షణ శిబిరంలో వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి 176మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఐఏడీవీఎల్ ఎస్ఐజీ చర్మశస్త్ర చికిత్సా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరాజు, సూపరింటెండెంట్ శాంతయ్య, సీఓఓ రాజారాజన్, జనరల్ సర్జన్లు, అనస్థీషియాలజిస్టులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారత సదస్సు

ఆశ్రం మెడికల్ కళాశాల మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, స్వీయరక్షణపై వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత మాట్లాడుతూ మహిళలు సురక్షితంగా ఎలా ఉండాలి, సహోద్యోగులతో పని చేయడం, ఆఫీసు పరిధిలో మంచి వాతావరణం తదితర అంశాలు వివరించారు. నర్సింగ్ విద్యార్థినులు మహిళల భద్రత అంశంపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అచ్చిరెడ్డి, సీఈవో డాక్టర్ కె.హనుమంత రావు, ప్రిన్సిపల్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాలరాజు, సూపరింటెండెంట్ శాంతయ్య, రాజరాజన్, ఉమన్‌సెల్ చైర్‌పర్సన్ ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.


పోలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


చింతలపూడిలో మాట్లాడుతున్న సీఐ


పెదవేగిలో పోలీసుల ర్యాలీ

అమర పోలీసులకు నివాళి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ర్యాలీ

పోలవరం అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను దేశ ప్రజలు మరువరని డీఎస్పీ ఎం వెంకటేశ్వర రావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి ఏటిగట్టు సెంటర్ వరకూ విద్యార్థులతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఏటిగట్టు సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. సీఐ బాల సురేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలో సీఐ రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ర్యాలీలో ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న, చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అమర పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు అన్నారు. విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందించడంలో ఎందరో పోలీసులు అమరులయ్యారని వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కె.సోమరాజు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై పి.నవీన్‌కుమార్ అన్నారు. జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పించారు. కానిస్టేబుళ్లు సుధాకర్, సత్యనారాయణ ఉన్నారు. జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరావు కలెక్టరు నుంచి ప్రశంస పత్రం అందుకున్నారు. ప్రజాప్రతినిధులు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది సీఐకు అభినందనలు తెలిపారు.

● కామవరపుకోట: తడికలపూడి పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల స్థూపానికి డీఎస్పీ రవిచంద్ర, సీఐ, ఎస్ఐలు నివాళులర్పించారు.

● భీమడోలు: పోలీస్ సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: సమాజంలో ప్రతి ఒక్కరూ ఎటువంటి భయాలు, ఆందోళనలు లేకుండా స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అది పోలీసులపై ఉన్న ప్రజలకున్న నమ్మకమేనని సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమరవీరుల పోరాటాలు స్ఫూర్తిగా శాంతిభద్రతలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని, సమాజ శ్రేయస్సుకు తమవంతు భాగస్వామ్యాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ త్యాగాలపై సీఐ పాడిన పాట ఆకట్టుకుంది. పెదవేగి, దెందులూరు ఎస్ఐలు కె.రామకృష్ణ, కె.శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండల కేంద్రంలో సీఐ రమేష్‌బాబు, ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజల కోసం శాంతిభద్రతలు కాపాడుతూ ఎందరో పోలీసులు అమరులయ్యారన్నారు. కుక్కునూరులోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం మానవ హారం నిర్వహించి పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు.

బెల్ట్ షాపు ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నందాపురంలో బెల్ట్ షాపు ఏర్పాటును గ్రామస్తులు అడ్డుకున్నారు. షాపు యజమానులు, గ్రామస్తుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. గతంలో నందాపురంలో మద్యం షాపు ఉండేది. మద్యం పాలసీలో ప్రభుత్వం మార్పులు చేయడంతో ప్రధాన షాపును బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన యజమానులు బెల్ట్ షాపు ఏర్పాటును కట్టుపల్లికి చెందిన వ్యక్తులకు ఇవ్వడంతో నందాపురంలో బెల్ట్ షాపు ఏర్పాటు చేయడానికి రావడంతో స్థానికులు అడ్డుకున్నారు. బయట వ్యక్తులు షాపును ఏర్పాటు చేస్తే అంగీకరించమని చెప్పడంతో చేసేదిలేక ఇతర గ్రామం నుంచి వచ్చినవారు వెనుదిరిగారు.

10 లీటర్ల సారా పట్టివేత

కుక్కునూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేలేరులో సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో సారా స్థావరాలపై దాడి చేశారు. సారా సరఫరా చేస్తున్న ఎస్.సురేష్ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

కలెక్టర్ దృష్టికి రైతు సమస్యలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ వెట్రిసెల్వికి వివరించినట్టు సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ముసునూరు మండలంలో గొల్లపూడి, చెక్కపల్లి, లింగపాలెం మండలంలో కలరాయనగూడెం గ్రామాల్లో మొక్కజొన్న రైతులు భారీగా నష్టపోయారని, మొక్కజొన్న విత్తనాల కంపెనీ వారు తీరని ద్రోహం చేశారని వివరించినట్టు చెప్పారు. వివరాలను కలెక్టర్‌కు వివరించామని చెప్పారు. కలెక్టర్ తగు చర్యలు తీసుకుని రైతులకు తగు న్యాయం చేస్తామని ఆశిస్తున్నట్టు తెలిపారు.

మద్ది క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలపై సమీక్ష

జంగారెడ్డిగూడెం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో నవంబరు 2 నుంచి కార్తీక మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వ శాఖల అధికారులంతా సహకరించాలని ఈవో ఆర్‌వి.చందన కోరారు. ఆర్డీవో కార్యాలయంలో ఎ.సోమేశ్వరరావు అధ్యక్షతన సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. రద్దీ సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఏవో సోమేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే చంటి


మెప్మా స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్

ఏలూరు టూటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల స్టాల్స్‌ను ఎమ్మెల్యే, మేయర్ సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడాలన్నారు. రానున్న రోజుల్లో నెలలో రెండు సార్లు మెప్మా బజార్లను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మెప్మా మేనేజర్ ఝాన్సీరాణి, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్.పెదబాబు, జాలా బాలాజీ, రెడ్డి నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

కొత్తపేటలో పరమటమ్మ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే చంటి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నల్లదిబ్బ ప్రాంతంలో శ్రీమహిషాసుర మర్దని, కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చింతమనేని

పెదవేగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాలలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల సత్వరాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో రహదారులు బాగుంటే పారిశుధ్యం మెరుగుపడి, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సర్పంచ్ క్రీస్తుమణి, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పెదపాడు: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా వున్న ప్రజల సమస్యలను మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. అనంతరం ఫిర్యాదుదారుల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో అమీలు జమ, తహసీల్దారు కృష్ణజ్యోతి, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట


కేతవరంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి అన్నారు. కేతవరంలో ఉపాధి నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించిందన్నారు. సర్పంచ్ తడికలపూడి శివమాధవి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, భీమవరపు జగన్మోహన్‌రావు, జయవరపు శ్రీను, బిక్షమయ్య, లింగారెడ్డి నాగేశ్వరరావు, బొందలపాటి సత్యనారాయణ, వెలిది నాగబాబు, పంతగాని సోమరాజు, బత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు, అక్టోబరు 21: ఉంగుటూరు మండలం చేబ్రోలులో మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఎంపి పుట్టా మహేశ్ యాదవ్ కూడా పాల్గొంటారన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ, పి.ధాత్రిరెడ్డి సోమవారం తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** విద్యార్థి సర్టిఫికెట్లు ఇవ్వని శ్రీవైష్ణవి కళాశాల యాజమాన్యంపై బాధిత విద్యార్థి అచ్యుత్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశాడు.
- **ఏలూరు కార్పొరేషన్ :** కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబా అన్నారు. రాష్ట్ర వర్క్‌షాపును నారపల్లి రమణరావు అధ్యక్షతన నిర్వహించారు.
- **చింతలపూడి :** కనకలింగ వీరబ్రహ్మంకు విజయవాడకు చెందిన అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రరత్న అవార్డును బహూకరించింది.
- **బుట్టాయగూడెం :** గిరిజనుల అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సంపూర్ణ సహకారం అందించనున్నట్లు డ్రీమ్‌సెన్స్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు శ్వేత, నిఖిల్ తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు జీసీసీ కాఫ్ హజ్‌ను, కారంపొడి తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.
- **ద్వారకాతిరుమల :** ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో జరిగిన 24 గంటల నిర్విరామ కవితాగానంలో భాగస్వామ్యులైన పంగిడిగూడెం తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజుకు అరుదైన గుర్తింపు లభించింది. ఆయనపేరును అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టీఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ప్రతిపాదించారు.
- **భీమడోలు :** హెడ్‌కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాసరావు ఉత్తమ సేవలకు జిల్లా అధికారులు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఏలూరులో కలెక్టర్, ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ శ్రీనివాసరావును అభినందించారు.



ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద పారిశుధ్య కార్మికుల ధర్నా


పోలవరం సీహెచ్‌సీ వద్ద కార్మికుల నినాదాలు


చింతలపూడిలో పారిశుధ్య కార్మికుల దీక్ష

సమస్యల హోరు

పారిశుధ్య కార్మికుల ధర్నా

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులలో పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల జీతం, పీఎఫ్ బకాయిలు వెంటనే జమ చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి వి దత్తాత్రేయ, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు బ్రాంచ్ కార్యదర్శి డి లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు సోమవారం గంట సేపు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఏరియా, కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీ, ఏలూరు సర్వజన ఆసుపత్రులలో పారిశుధ్య పనులను ఫస్ట్ ఆబ్జెట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టు పొందారని పారిశుధ్య కార్మికులకు రెండేళ్ల నుంచి పీఎఫ్ బకాయిలు చెల్లించలేదన్నారు. ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశామని, తమ సమస్యను పట్టించుకోకపోవడంతో నవంబర్ 1 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. నెలాఖరు వరకూ రోజుకు గంట పాటు విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ కార్యదర్శి పి విజయ, నాయకులు వినోద్, కరీమా, నరేష్, కల్యాణ్ పాల్గొన్నారు.

● చింతలపూడి: పెండింగ్ జీతాలు విడుదల చేయాలంటూ స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి పి.బాబు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐకు చెల్లించాల్సిన నిధులు విడుదల చేయాలని, కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రెండో దీక్షలో టి.మరియమ్మ, కె.నాగరాజు, శ్రీనివాసరాజు, రాము, సుజాత పలువురు పాల్గొన్నారు.

● పోలవరం: ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం పారిశుధ్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. అధికారులు వెంటనే స్పందించి జీతాల బకాయిలు, పీఎఫ్ సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● బుట్టాయగూడెం: వేతన బకాయిలు చెల్లించాలని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ బుట్టాయగూడెం సీహెచ్‌సీ పారిశుధ్య కార్మికులు ఆందోళన కొనసాగించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మద్దతు తెలిపారు. కె.కృష్ణ, ఎస్.ధర్మరాజు, ఎం.సత్యవతి, ఎం.సుందరమ్మ, కె.లక్ష్మీ, ఎం.సుజాత పాల్గొన్నారు.

రైతు, ప్రజా సమస్యలపై వినతి

ఏలూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజా సమస్యలపై రైతుసంఘం, సీపీఐ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ముసునూరు మండలంలో గొల్లపూడి, లోపూడి, చెక్కపల్లి, లింగపాలెం మండలం, కలరాయునిగూడెం గ్రామాల రైతులకు మొక్కజొన్న విత్తనాల పంపిణీ, నకిలీ విత్తనాలు ఇచ్చి రైతులకు దిగుబడి రాక తీవ్రనష్టాలకు గురి అయ్యారని ఆర్.లక్ష్మణరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జంగారెడ్డిగూడెంలో రైతు భూమికి సంబంధించి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎస్పీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వరప్రసాదరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జీవోలు అమలు చేయాలి

గ్రామాల్లో రజకులకు కేటాయించిన వృత్తి చెరువుల విషయంలో అధికారులు జీవోలను అమలు చేయాలని రజక జనసంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో సమావేశం జరిగింది. అనంతరం దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామ రజకసంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గ్రామసంఘాలకు గ్రామ పంచాయతీలకు కేటాయించిన చెరువులను పూర్తిస్థాయిలో సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరిని కలిసి సమస్యలు ఆమె దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శనివారపుపేటలోని అన్నేనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, గవరవరం గట్టు కాలనీలకు డ్రెయినేజి కల్వర్టు నిర్మించాలని, శ్రీరామ్‌నగర్‌లో డ్రెయినేజి నిర్మాణం చేయాలని సీపీఎం సభ తీర్మానించింది. సోమవారం శనివారపుపేటలో సీపీఎం మహాసభకు గొట్టాపు మురళీ అధ్యక్షత వహించారు. అనంతరం శనివారపుపేట ఏరియాలో సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. నీటి పన్ను తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్నేకాలనీలో దక్షిణవైపు రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పళ్ళెం కిశోర్, కె.రామాంజనేయులు, చంద్రరావు, అప్పారావు, మీర, గణేష్, గొట్టాపు రంగమణి పాల్గొన్నారు.



ఉత్తమ పోలీసు అవార్డును కలెక్టర్, డీఐజీల నుంచి అందుకుంటున్న ముదినేపల్లి కానిస్టేబుల్ నాగబాబు

ముదినేపల్లి కానిస్టేబుల్ నాగబాబుకు అవార్డు

ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముదినేపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బత్తిన నాగబాబు బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఆఫ్ ది డే అవార్డును అందుకున్నారు. సోమవారం ఏలూరులో జరిగిన సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ వెట్రి సెల్వీ, డీఐజీ అశోక్ కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. నాగబాబును జేసీ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్ కుమార్, కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు స్టేషన్ సిబ్బంది అభినందించారు.

శ్రీశ్యామలాంబ గ్రామోత్సవం

కైకలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం గ్రామోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఇంటింటా భక్తులు హారతులు పట్టి పూజలు చేశారు. ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు.

కొల్లేరు ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

కైకలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర టీడీపీ వడ్డీసాధికారి సమితి కన్వీనర్ బలే ఏసురాజు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు అన్నారు. సోమవారం కైకలూరు మండలం కొట్టాడలో పల్లెపండుగ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణానికై భూమిపూజ చేశారు. గ్రామపెద్దలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పెద్దింటమ్మ హుండీ ఆదాయం రూ.9 లక్షలు

కైకలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీల కానుకల మొక్కుబడుల ఆదాయం 121 రోజులకు లెక్కించగా రూ.9,07,104 వచ్చినట్టు ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎండోమెంట్ తనిఖీ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపును నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, గ్రామస్తులు ఆలయ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలో మంగళవారం నుంచి పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. 22, 23 తేదీల్లో రమణక్కపేట గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక క్యాంపు జరుగుతుందన్నారు. 24,25 తేదీల్లో చెక్కపల్లి ఎచివాలయం వద్ద క్యాంపు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆధార్ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

బెల్లం ఊట ధ్వంసం

నూజివీడుటౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 21: నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు తెలిపారు. చాట్రాయి మండలం పోతనపల్లిలో నిర్వహించిన దాడుల్లో 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 21: నూజివీడు మండలం పాతరావిచర్లలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. 9 వాహనాలను, 84,560 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● చాట్రాయి: కృష్ణారావుపాలెంలో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేశారు. 5 బైక్‌లు, రూ.27,450 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కారు పల్టీ : నలుగురికి గాయాలు

చాట్రాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో సూరంపాలెం వద్ద ఆదివారం రాత్రి కారు పల్టీ కొట్టడంతో నలుగురు గాయపడ్డారు. లింగపాలెం మండలం యర్రంపల్లికి చెందిన గోలి వెంకటేశ్వరరెడ్డి భార్యా, కుటుంబ సభ్యులతో కలిసి కారులో సత్తుపల్లి వెళ్లి తిరిగివస్తుండగా కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. గాయపడిన వారిని 108లో విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



అమర పోలీసులకు చిన్నారుల సెల్యూట్

చిన్నారుల నివాళి

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నివాళులర్పించారు. హెచ్‌ఎం వెంకట్రావు పాల్గొన్నారు.



మూల్లంకలో అమరవీరుడు మనోజ్ కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ, పోలీసు బృందం



కైకలూరులో పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న పోలీసులు

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

కలిదిండి/కైకలూరు/మండవల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మూల్లంకలో సోమవారం కైకలూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం అమరవీరుడు గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కర్రి మనోజ్ కుమార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కలిదిండిలో హెల్మెట్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, మండవల్లి ఎస్ఐ రాంబాబు, పోలీసు సిబ్బంది, మూల్లంక సర్పంచ్ మహదేవ విజయ బాబు, అమరవీరుడు కర్రి మనోజ్ కుమార్ తల్లిదండ్రులు కర్రి సత్యనారాయణ, అప్పాయమ్మ తదితరులు పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తూ కైకలూరు పట్టణంలో ర్యాలీ చేశారు. విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల చేసిన త్యాగాలు మహోన్నతమైనవని కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ పేర్కొన్నారు. ఎస్సైలు వి.రాంబాబు, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. మండవల్లిలో పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండవల్లి ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు ఆధ్వర్యంలో మానవ హారం, ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను వివరించారు.



మండవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొక్కల పెంపకంతో మంచి ఆరోగ్యం

తెలుగు రైతురాష్ట్ర కార్యదర్శి చలసాని

ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పర్యావరణాన్ని కాపాడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు మొక్కలను నాటాల్సిన అవసరముందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలను నాటే కార్యక్రమాలను నిర్వహించారు. చిగురుకోట అంగన్‌వాడీ కేంద్రం వద్ద జగన్మోహనరావు మొక్కలను నాటారు. కార్యకర్త కొడాలి రాజా, అంగన్‌వాడీ కేంద్రం టీచరు సూరపనేని అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని



యుటీఎఫ్ ముదినేపల్లి మండల శాఖ నూతన కార్యవర్గం

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలిగా సాయిలక్ష్మి

ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) ముదినేపల్లి మండల శాఖకు నూతన కార్యవర్గం ఏర్పడింది. ముదినేపల్లిలో సోమవారం జరిగిన యూనియన్ ఉపాధ్యాయుల సమావేశంలో మండల శాఖకు అధ్యక్షురాలిగా వాడవల్లి యూపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.సాయిలక్ష్మి తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల శాఖ గౌరవాధ్యక్షుడుగా వల్లూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఐ.దుర్గా ప్రసాద్, సహాధ్యక్షుడిగా దినేష్ బాబు, కార్యదర్శిగా సనావుల్లా, కోశాధికారిగా యశోద కృష్ణతోపాటు కార్యవర్గ సభ్యులు బొడ్డు పాండురంగారావు, సుందర మస్తాన్, డి.గంగాధర్‌రావు, కె.ఆంజనేయ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ నాయకులు గొట్టిపాటి రమేష్, సాగర్, బేతాళరావు సమావేశంలో పాల్గొన్నారు.

ధ్యానంతో మనసు ప్రశాంతం : మంత్రి పార్థసారధి



బౌద్ధ సాధువులకు వస్త్రాలు అందచేస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడు చూపిన ధ్యానమార్గంతో మనసు ప్రశాంతంగా ఉంటుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు జంపాల సత్యనారాయణరాజుతో కలిసి మంత్రి బౌద్ధ సాధువులకు వస్త్రాలు, సామగ్రిని అందజేశారు. అనంతరం బౌద్ధ గురువులచే జరిగిన ధ్యాన ప్రక్రియ లో మంత్రి ధ్యానం చేశారు. బౌద్ధ సాధువులున్న ప్రదేశం ఎప్పుడూ సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం మంత్రి పార్థసారధిని ట్రస్ట్ చైర్మన్, గ్రామప్రముఖులు సన్మానించారు. సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి, శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా బీజేపీ బలోపేతం : ఎమ్మెల్యే కామినేని



సమావేశంలో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

నూజివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేసే దిశగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. నూజివీడులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంద న్నారు. గ్రామీణస్థాయిలో బీజేపీ మరింత బలపడటానికి కార్యకర్తలు విశేషంగా కృషిచేయాలన్నారు. జిల్లాలో నూజివీడు నియోజకవర్గం సభ్యత్వ నమోదులో నాలుగో స్థానంలో ఉందని జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్ తెలిపారు. సభ్యత్వ నమోదుకు నెలాఖరు వరకు సమయం ఉందన్నారు. ప్రతి మండలంలో సభ్యత్వాల నమోదు చేయాలన్నారు. శివరాజు వసుంధరాదేవి, కట్నేని కృష్ణప్రసాద్, శరణాల మాలతీ రాణి, కోటప్రోలు కృష్ణ, జీఆర్‌కే.రంగారావు, ఎం.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి



ఓటు నమోదు పత్రాన్ని అందజేస్తున్న నేతలు

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి సూచించారు. మండలంలోని గుడిపాడులో తెలుగుయువత కార్యనిర్వహణ కార్యదర్శి గద్దెరఘుబాబు, కొల్లి గంగారామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్‌నమోదు ఇంటింటి క్యాంపెయిన్‌లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఓటు అర్హత ఉన్న వారికి ఫారం -18 అందజేసి ఓటునమోదుపై అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రులు అందరూ ఓటును నమోదు చేసుకుని కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం పాలనతో అభివృద్ధి, సంక్షేమం వేగంగా అమలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మండలపు బుజ్జియ్య నాయకులు మండలపు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

నూజివీడుటౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 21: చెవుడు నివారణ కార్యక్రమంలో భాగంగా వినికిడి సమస్య ఉన్న వారికి వినికిడి యంత్రాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి షర్మిష్ట తెలిపారు. వినికిడి సమస్య ఉన్న వారు యంత్రాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఇందుకు గాను ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్ కార్డు తదితర పత్రాలతో నూజివీడు అర్బన్ క్లినిక్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ముదినేపల్లి ఎస్ఐగా వీరభద్రరావు



ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముది నేపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.ఎస్. వీర భద్రరావు నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల పోలీస్ స్టేషన్ నుంచి ఆయన ముదినేపల్లి బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన డి.వెంకట్ కుమార్ కైకలూరు టౌన్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.

తొమ్మిది అర్జీల స్వీకరణ

కలిదిండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తొమ్మిది అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఆర్ఐ శ్యామల, సర్వేయర్ మహమ్మద్ షమీ పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి

ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం గ్రోవెల్ ఫీడ్స్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం సహకారంతో ముదినేపల్లి మండలం పెదగొన్నూరు ఆర్ అండ్ బీ రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం చేపట్టారు. సింగరాయపాలెం - భీమవరం స్టేట్ హైవేలో పెదగొన్నూరు పంచాయతీ ఏరియాలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించే పనులతోపాటు విశ్వనాద్రిపాలెంలో గోతులమయమై ఆర్ అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులను నిర్వహి స్తున్నారు. సర్పంచ్ తాడంకి శిరీష, ఎన్‌డీఏ నాయకులు ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు

నూజివీడుటౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 21: ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, ఇతర అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు మామిడి పంటకు మూడేళ్లకు రూ.1.03 లక్షలు, జామ రైతులకు రూ.2.3 లక్షల లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటలను పోత్సహించాలన్నారు. రహదారులు, డ్రెయినేజీల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు. ఏపీవో సర్వేశ్వరి, ఇన్‌చార్జి ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించాలని, వారిలో నైపుణ్యం వెలికితీయవచ్చని హెచ్‌ఎం అబ్బాస్ బక్కావరీ అన్నారు. చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కలిసి సోమవారం ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల్లో పురోభివృద్ధిని పెంచాలన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు జి. యోగిత, పద్మకిశోర్, కళాధర్, రాంబాబు, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం పాల సహకార సంఘానికి చెందిన పాల ఉత్పత్తిదారు చనుమోలు వేణు మాధవ్ కుమార్తె గౌతమి వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం లో రూ 20 వేలు విలువైన బంగారు నాణేన్ని సోమవారం పెండ్లి కుమార్తెకు సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, వేతన కార్యదర్శి పాపోతు రాంబాబు పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులకు విరాళం

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో విద్యుత్ మరమ్మతులకు ఉపాధ్యాయుడు తిరుపతయ్య రూ 10 వేలు అందజేశారు. వైరింగ్ పనులు చేయిస్తున్నారు. ఉపాధ్యాయుడు తిరుపతయ్యను హెచ్‌ఎం బక్కయ్య, టీచర్లు అభినందించారు.



ఏలూరు జడ్పీ అతిథి గృహం వద్ద వైసీపీ జడ్పీటీసీలు

జడ్పీలో జగడమేనా?

- మళ్లీ అత్యవసర సమావేశానికి పట్టుపట్టిన వైసీపీ
- ఏలూరులో సమావేశమైన 30 మంది జడ్పీటీసీలు
- నెలలో ఇది రెండోసారి డిమాండ్
- వెనకుండి నడిపిస్తున్న నేతలెవరు ?
- చైర్‌పర్సన్ పద్మశ్రీ అనుకూలురుల్లో మాత్రం ధీమా



(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌లో రోజురోజుకు రంగులు మారుతున్నాయి. ఇంతకుముందు వైసీపీ పక్షానికి చెందిన ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆమె ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి తన భర్తతో సహ టీడీపీలో చేరారు. దీంతో జిల్లా పరిషత్‌లో అత్యధిక బలం కలిగిన వైసీపీ కాస్తా ఖంగుతింది. కాని తమకున్న బలంతో ఎట్టి పరిస్థితుల్లోను కొన్ని తీర్మానాలను అడుకోవాలని, ఇంకొన్నింటిని ముందుకు సాగకుండా చూడాలని, తద్వారా తమ పార్టీ ఉనికిని జడ్పీలో కాపాడుకునేందుకు వైసీపీ తరచూ ఎత్తుగడలు వేస్తూనే ఉంది. ఇప్పటికే జిల్లా పరిషత్‌కు సంబంధించి అత్యవసర సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా వైసీపీ అనుకూల జడ్పీటీసీలందరూ గట్టిగా పట్టుపడుతున్నారు. పక్షం రోజులకు ముందే ఒకసారి అత్యవసర సమావేశానికి పట్టుపట్టారు. తిరిగి మరోసారి వైసీపీ అనుకూల జడ్పీటీసీలంతా సోమవారం జడ్పీ అతిథి గృహంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

జిల్లా పరిషత్‌లో మొదటి నుంచి వైసీపీదే ఆధిపత్యం. జడ్పీలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 48 కాగా దీనిలో 46 వైసీపీ అనుకూలురుదే. వీరవాసరం, ఆచంట జడ్పీటీసీలు మాత్రం కూటమి పక్షంలో ఉన్నాయి. ఇంత అత్యధిక బలం కలిగిన జడ్పీలో అనూహ్యంగా చైర్‌పర్సన్ నేరుగా టీడీపీలో చేరారు. ఆ తరువాత మరి కొంతమంది జడ్పీటీసీలు టీడీపీలో చేరతారని అందరూ భావించారు. ఆ ప్రక్రియ మాత్రం ఇప్పటిదాకా పూర్తికాలేదు. దీనికి తోడు వైసీపీ పెద్దలు మాత్రం జడ్పీలో తమకున్న బలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాగూ నాలుగేళ్ళు దాటనిదే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అవకాశం లేదన్న భావనతో ఏదొక రకంగా తమ పార్టీ ఉని కి ఉండేలా జాగ్రత్తపడడం ఆరంభించారు. జడ్పీటీసీ సభ్యులను పార్టీని వీడకుండా ఇప్పటికే కొంతమంది పూర్తిగా అనునయించారు. ఎందుకనంటే చైర్‌పర్సన్ ఒక్కసారిగా పార్టీ మారడంతో జడ్పీలో అత్యధిక సభ్యులు కూడా ఇదే బాట పడతారని అందరూ ఊహించారు. తీర ప్రాంతానికి చెందిన జడ్పీటీసీలు కొందరు నేరుగా జనసేనలోకైనా వెళ్తామే తప్ప టీడీపీ వైపు రాబోమన్న నిర్ణయానికి వచ్చారు. ఇలాంటి తర్జన భర్జనలు జడ్పీటీసీ సభ్యుల మధ్య తరచూ చోటు చేసుకుం టున్నాయి. స్థానికంగా ఎమ్మెల్యేలంతా కూటమి పక్షానికి చెందిన వారు కావడం, తాము మాత్రం మండల స్థాయిలో జడ్పీటీసీ సభ్యులుగా వైసీపీలో ఉండి ఏమాత్రం ప్రయోజనమని భావిస్తున్న మరికొందరు మాత్రం టీడీపీవైపు తొంగి చూడడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాము ఎదురుతిరిగి ఏమీ చేయలేమని, సర్దుకుపోవడమే తప్ప అనే భావనలో ఇంకొందరు ఉన్నారు. ఇలా రకరకాలుగా ఎవరంతట వారుగా జడ్పీటిసిలు తమ మనోభావాలను పూర్తిగా బయట పెట్టలేక, అలాగని మౌనం దాల్చి ఉండలేక సతమతమవుతూనే ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి మాత్రం టీడీపీ కైవసం అయినా జడ్పీటీసీ సభ్యుల్లో మాత్రం ఇంకా ఊగిసలాట కొనసాగుతూనే ఉంది.

ఎందుకు అత్యవసర సమావేశం ?

జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహించాలని కొందరు జడ్పీటీసీలు గట్టిగా పట్టుపట్టడానికి వెనుక బలమైన కారణాలు ఉన్నాయా ? వైసీపీలో కొందరు పెద్దల ఆదేశం మేరకే ఈ రకంగా బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారా? లేకుంటే జిల్లా పరిషత్ తమ ఆధీనంలో ఉంద న్న సంకేతాలు బలంగా బయటకు వెళ్ళేలా కొత్త ఎత్తుగడ వేశారా అనే సందేహాలే ఇప్పుడు అందరిలోనూ ఉన్నాయి. వాస్తవానికి జిల్లా పరిషత్‌లో అభివృద్ధి, సంక్షేమా నికి సంబంధించి పెద్దగా నిధులు లేవు. జగన్ ప్రభుత్వ హయాంలో జడ్పీలకు ఎక్కడా ఆర్థిక ఊతమివ్వలేదు. ఆఖరుకి జనరల్ ఫండ్ విషయంలోను ఎప్పుడూ దోబూచులాటే. ఒకానొక దశలో జిల్లా పరిషత్‌లు తమ సభ్యులందరికీ జనరల్ ఫండ్ కింద కొన్ని నిధులు కేటాయించి వారి ఆధ్వర్యంలోనే ఆయా మండలాల్లో పనులు సాగేలా చూడడం సమాంతరంగా జడ్పీటీసీలకు కూడా స్థానికంగా ప్రతిష్ట ఉండేలా జాగ్రత్తపడిన సందర్భాలు ఉన్నా యి. కాని వైసీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం ఇవేవీ అప్పటి ప్రభుత్వానికి పట్టలేదు. జిల్లా పరిషత్‌లు దాదాపు నీరసించాయి. కొత్త పనులు చేపట్టలేక ఏదో తూతూ మంత్రంగా వ్యవహారం నడిపేవి. ఇప్పుడు పంచాయతీరాజ్ విభాగంలో మంత్రి పవన్‌కళ్యాణ్ వినూత్న చర్యలకు దిగుతుండడం, ఆయా పనులకు దగ్గరుండి పర్యవేక్షణ, నిధుల కేటాయిస్తుండడంతో కొంతమేర నూతన ఉత్తేజం కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహణకు వీలుగా వైసీపీ ఎజెండా ఏమిటనేదే అందరి ప్రశ్న. జడ్పీ అతిథి గృహంలో సోమవారం జడ్పీటీసీల సమావేశం నిర్వహణకు వైసీపీలో ఒక సీనియర్ నేత దగ్గరుండి నడిపించారని చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసీపీ నాయకత్వం బలహీనపడినా ఇంకో వైపు జిల్లా పరిషత్ సభ్యులను మాత్రం నేరుగా డైరెక్ట్ చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాదరావు మాత్రం ఇప్పటికీ ధీమాతో ఉన్నారు. కేవలం అలజడి సృష్టించ డానికా, లేక తమకు కొత్త అవకాశాలు రావడానికా, జడ్పీటీసీల దూకుడనేది త్వరలో తేలబోతుందని ఇంకొందరు విశ్లేషిస్తున్నారు. అత్యవసర సమావేశాన్ని కోరుతూ దాదాపు 30 మంది జడ్పీటీసీలు సంతకాలు చేయడం మరొక అంశంగా భావిస్తున్నారు. ఇప్పటిదాకా అత్యధికులు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలోకి వస్తారని అందరూ లెక్కకట్టారు. కాని తాజా పరిణామాల ప్రకారం వైసీపీ అనుకూల జడ్పీటిసిలు ఉమ్మడిగా ఒకవైపే ఉండబోతున్నారా లేక అత్యవసర సమావేశమంటూ ఒక ఝలక్ ఇచ్చి తదుపరి నిర్ణయాల వైపు తొంగి చూస్తున్నారా అనేది కూడా చాలా మందిలో ఓ అభిప్రాయం ఉంది. అలా కాకుండా వైసీపీకి అనుకూలంగానే కడదాకా ఉండాలని వీరంతా భావిస్తే ఉమ్మడి పశ్చిమ జడ్పీలో మాత్రం భవిష్యత్తులో ఒకింత కుదుపే కాబోతుంది.

హత్యాయత్నం కేసుల్లో..

11 మందికి మూడేళ్ల జైలు


ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడినట్లు ఇరువైపులా నమోదైన రెండు కేసుల్లో నేరం రుజువు కావడంతో మొత్తం 11 మందికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంనకు చెందిన పేనేటి రంగనాయకమ్మ కుటుంబానికి, యలమర్తి భూపతియ్య కుటుంబాల మధ్య రెండేకరాల వ్యవసాయ భూమి (నిమ్మతోట)లో తగాదాలు ఉన్నాయి. 2011 మే 4వ తేదీ ఉదయం యలమర్తి భూపతయ్య కోడలు పద్మాకు రెండేకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో మామిడి చెట్లు కాయలు కోయడానికి వెళ్లగా పేనేటి రంగనాయకమ్మ, యలమర్తి భాస్కర్ చౌదరి, యలమర్తి దుర్గాదేవి, యలమర్తి గాంధీ, దేవినేనివారిగూడానికి చెందిన పాకలపాటి సుబ్రహ్మణ్యం కత్తులతో దాడి చేసి గాయపరిచారు. భూపతయ్య ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ ఎస్.పోతురాజు ఆ నిందితులపై హత్యాయత్న కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. నిందితులు ఐదుగురిపై నేరం రుజువు కావడ ంతో ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు.

ఇదే గొడవలో అదే గ్రామానికి చెందిన పేనేటి రంగనాయకమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ద్వారకా తిరుమల పోలీసులు అదే గ్రామానికి చెందిన యలమర్తి భూపతయ్య, యలమర్తి కాంతా రత్నం, యలమర్తి శ్రీనివాసరావు, యలమర్తి లక్ష్మణ రావు, యలమర్తి భాస్కరసురేష్, దెందు లూరు మండలం పెరుగ్గూడానికి చెందిన నల్లూరి శివ నాగుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ పోతు రాజు హత్యాయత్న కేసు నమోదు చేశారు. ఈ కేసు కూడా ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది.

ఈ ఆరుగురు నిందితులపై కూడా నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ లక్ష్మణ్ నాయక్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, కోర్టు కానిస్టేబుల్ సంసుద్దీన్, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ మురళీ, ఎస్ఐ సుధీర్‌బాబు సహకరించారు.

హరహరా అంటే కోనేరులో నీటి బుడగలు

కలిదిండిలో ప్రాచీన ఆలయం



కలిదిండిలో అతి ప్రాచీన దేవాలయం పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయాన్ని రాజరాజ చోళుడి కుమారుడు రాజరాజ నరేంద్రుని కాలంలో ఒక రైతు నాగలితో పొలం దున్నుతుండగా నాగలికర్రు తగిలి నెత్తురు వరదలై బయట పడ్డ స్వయంభూ లింగంగా స్థల పురాణం చెబుతోంది. స్వయం భూ లింగం బయటపడిన చోటే ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణలో పంచబుగ్గల కోనేరు ఉంది. కోనేరు చెంతకు భక్తులు వెళ్లి హరహర అంటే బుడ బుడమంటూ ఐదు బుగ్గలు రావటాన్ని నేటికీ ప్రత్యేకంగా వీక్షించవచ్చు. దక్షిణ కాశీగా పేరొందిన కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. -కలిదిండి